
GIRDHARI, RNI Regn.No.TELTEL/2021/80612, Date of Pub - 25th of every month
Date posting - 1st of every month at BPC-IV, Patrika Channel, HYD - 01
Postal Regn.No.HQ/SD/525/2024-2026; Licensed to Post without prepayment
WPP No.PMG/TS/HQR/SC-04/WPP/2024-2026



వినాయక నిమజ్జనం 4-9-2025



Edited, printed, published and owned by Swami Sundara Chaitanyananda, Printed at M/s Karshak Print Solutions Pvt. Ltd., Moula Ali, Hyd - 500 040.


IF UNDELIVERED PLEASE RETURN TO :

**SUNDARA CHAITANYA ASHRAM**
**HYDERABAD - 500 043**

# గిరిధారి

అక్టోబరు 2025

శాశ్వత చందా రూ.1200/-
10 సం॥ లకు



గురుగోవిందుల ఆనంద హేల





శ్రీ గణేశ
నవరాత్రి ప్రారంభం
27-8-2025













# ప్రార్థన





శ్లో॥ శుభం కరోతి కళ్యాణం
ఆరోగ్యం ధన సంపదః ।
శత్రు బుద్ధి వినాశాయ
దీప జ్యోతి ర్నమోస్తుతే ॥

శుభమును ప్రసాదించునది, జ్ఞానైశ్వర్యమును, సంపదను అనుగ్రహించునది, బుద్ధికి శత్రువైన అజ్ఞానమును అంతమొందించునది యగు దీపజ్యోతికి నమస్కారము.



పండుగలు

**2-10-2025** - విజయదశమి
**20-10-2025** - దీపావళి

ఆధ్యాత్మిక మాసపత్రిక
సంపుటి : 40 సంచిక : 11
వ్యవస్థాపకులు :
శ్రీ స్వామి సుందర చైతన్యానంద
సంపాదకులు : శ్రీ స్వామి సుందర చైతన్యానంద

## ఇందులో



జీవిత సభ్యత్వం - రూ. 1200 /-
(10 సంవత్సరములు)


డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

వివరములకు : సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్:(08418)255777, 9100908777

Visit us at : www.sundarachaitanyam.com ( email : admin@sundarachaitanyam.org )









# ఆప్తవాక్యం

## ఉషోదయంలో జ్ఞానోదయం

ఏదో జరిగిందని
ఏదేదో జరిగిపోయిందని
బాధల్లో యెద కుమిలిపోయిందని
తీపి చేదుగా మారిందని
తెలుపు నలుపైందని
ఆశాసౌధాలు పేకమేడలై కూలిపోయాయని - ఎంతోమంది ప్రొద్దుపోయే వేళ,
సద్దు మణగే వేళ గుండె భారంతో క్రుంగిపోతూ ఉంటే,



మంచులా కురిసే మంచిలో తడుస్తూ,
చిరుగాలుల వలె చిరుచిరు నవ్వులు ఒలికిస్తూ
ఊగే మొక్కల వలె హృదయాన్ని ఊయల చేసుకొని
సమతను పంచే ఊహలలో తేలిపోతూ
మధ్యలో,
నిస్తరంగ జలధిలా నిర్వికల్పమై శోభిస్తూ
ఉషోదయంలో జ్ఞానోదయానికి శ్రీకారం చుట్టి - ఎందరో ధన్యజీవులు ప్రభాతవేళ
ఆనందంతో పొంగిపోతూ ఉంటారు.



కొందరి సంస్కారాలు సంతాపాల అంగడులైతే,
మరి కొందరి సంస్కారాలు సంబరాల సందడులు.

ప్రాతఃకాలం పవిత్రం
ప్రాతః స్మరణం పరమ పవిత్రం.

అజ్ఞాన రాతలను సమూలంగా తుడిపి
జ్ఞాన జలంతో హృదయాన్ని చల్లగా తడిపే
పవిత్ర జ్ఞాన తీర్థం ప్రాతఃస్మరణం.

ద్వైతాన్ని అదృశ్యం చేసి
అద్వైతాన్ని ఔదల నిలిపేందుకు
ఆచార్యుని - శ్రీ శంకరాచార్యుని అభయహస్తం ప్రసాదించిన ఆశీర్వచనం.

త్రిసంధ్యలను ఏకం చేస్తూ
పవిత్ర ప్రాతః సంధ్యలో
వికసించిన జ్ఞానకుసుమం ప్రాతఃస్మరణమ్

ప్రతిపదార్థ విపులీకరణం
సహేతుక ప్రామాణిక వివరణం
దివ్యమైన ఆ కుసుమ పరాగం.

అవలోకిస్తే వరరూపులు
ఆఘ్రాణిస్తే స్మరణీయులు.

అవిద్యా తిమిరాలు అంతరించి
సంశయ హిమం అదృశ్యమై
నూతన వెలుగులలో జీవిత లక్ష్యం స్పష్టమై
వెచ్చని, నులివెచ్చని నీరెండలో జీవనమార్గం సుస్పష్టమై
సౌరశక్తిలా నరనరాల్లో హరిశక్తి నిండి
అక్షయ ఫలం హృదయంలో పండి
భువిలో సురులై తరించేందుకు
మహేశ్వరులై చరించేందుకు





ఉద్యుక్తులైన ఉత్తమ సాధకులకు
ఉషోదయంలో
ఉర్విపై లభించే పీయూషమే ప్రాతఃస్మరణమ్

చల్లని జలాల్లో చలిస్తూ ఉంటే పద్మాలకు సౌందర్యం, సౌరభం.
నిర్మల శాంతిలో రమిస్తూ ఉంటే హృదయ పద్మాలకు సరళత్వం, సమత్వం.

చందమామ చలువను చిత్తానికి పట్టిస్తూ
విందుగా వీనులలో అమృతాన్ని ఒలికిస్తూ
నింగిలోని తారకలను కన్నులలో మెరిపిస్తూ
పుష్కలంగా హృదయంలో ఆనందాన్ని కురిపిస్తూ

జీవితానికి ఘనతను
జీవికి ధన్యతను పంచే ఆత్మానంద సుమలత ప్రాతఃస్మరణమ్
అవిరళంగా విరజిమ్మే దివ్య సౌరభమే విజ్ఞాన పరిమళమ్
అందించటం మా వంతు
ఆఘ్రాణించటం మీ తంతు
ఆ తరువాత అజ్ఞానం గల్లంతు
లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు ।

ఓం స్వామి సుందర చైతన్యానంద



# కావాలి రావాలి దీపావళి

(చైతన్య గానం - 7)

శ్రీమతి సి.పద్మ



పల్లవి : కావాలి - రావాలి - దీపావళి!
చీకటి ముసిరిన బ్రతుకుల
తిమిరాలను తరుముటకు ॥ కావాలి ॥

చరణములు :

1. మనసున తాపాలు మహిలో కలహాలు
మనుషుల నడుమ మారణ హోమాలు
మారాలని, పోవాలని సందేశ మిచ్చేదే ॥ కావాలి ॥

2. నరక దానవుడు దాగెను లోలోన
వేదన తిమిరాలు పరిచెను మనలోన
చీకట్లను పారద్రోలు శ్రీకృష్ణ జ్యోతి ॥ కావాలి ॥

3. ధరణిలో వెలగాలి సమతా జ్యోతి
మనసున నిలవాలి మంగళ హారతి
ప్రేమను గుండెలలో నిలిపే దీపం ॥ కావాలి ॥

4. మాయలు మాటలు మహిమలు కాలేవు
స్వరూప బోధయే కామధేనువు
భువినంతా దివిచేసే ఆర్షధర్మ జ్యోతి ॥ కావాలి ॥

పండుగలు ఆనందరూపాలు. మనిషి ఆంతర్యంలో పొంగే సంతోషానికి సంకేతాలు. ఆంతర్యంలోని ఆనందోత్సాహాలే బాహ్యంలో ఉత్సవాలుగా రూపు దిద్దుకుంటే బాహ్యంలో జరుపబడే ఉత్సవాలే ఆంతర్యంలో నూతన ఉత్తేజాన్ని నింపుతుంటాయి.

మనస్సులో ఇష్టాయిష్టాలు మారుతూ ఉంటే సుఖదుఃఖాలు మారుతూ ఉంటాయి. ఇష్టాయిష్టాలు మారుతూ ఉండినా సుఖం మాత్రం చెదరకూడదు అనేదే మన అభిమతమైతే అది మాత్రం ఎన్నటికి సాధ్యపడే విషయం కాదు. మనస్సు రాగద్వేషాల కూటమి. రాగమున్న చోటికి పరుగులెత్తడం ద్వేషమున్న వాటి నుండి పారిపోవడం మనస్సు నైజం. మనస్సుకు లోబడి ఉన్నంత వరకు మనిషి దుఃఖానికి లోనుగాక తప్పదు. సుఖసంతోషాలు మనస్సుకు సంబంధించినవి. నిత్యానందం ఆత్మకు సంబంధించింది. మనం కోరుకునే మారని ఆనందం ఆత్మానందమే. సుఖ సంతోషాలు వచ్చిపోయేవి. ఆత్మానందం ఎప్పటికి ఉండేది. వచ్చి పోయేవి కాబట్టి సుఖసంతోషాలు మిథ్య. ఆత్మానందం సత్యం. ఈ సత్య మిథ్యల సంబంధాన్ని వివరిస్తూ ఒకసారి పూజ్య గురుదేవులు ఇలా అన్నారు : 'పరమాత్మ ఆరాధన కోసమే పండుగలు వస్తాయి. పండుగలు వచ్చిపోతూ ఉంటాయి. పరమాత్మ ఎప్పుడూ ఉంటాడు. వచ్చి పోయే పండుగలు మిథ్య. ఎప్పుడూ ఉండే పరమాత్మ సత్యం. మిథ్య కూడా సత్యమే. కానీ సత్యం మిథ్య కాదు. పండుగ అంటే మీ దృష్టిలో ఏమిటి? కేవలం పిండివంటలు, క్రొత్త బట్టలూనా? పండగ వస్తే అవన్నీ వస్తాయి. కానీ అవి మాత్రమే పండగ కాదు. పాయసం కూడా పరమాత్మే. కానీ పరమాత్మ పాయసం కాదు - నువ్వు మింగలేవు' అంటూ గొల్లుమనే నవ్వుల మధ్య పండుగల వెనుక ఉండే పారమార్థిక తత్త్వాన్ని గుర్తింప జేసారు.



ఉన్ననాడు సుఖం, లేనినాడు దుఃఖం. ఉన్ననాడు పొంగకుండా ఉండగలిగితే లేనినాడు కృంగిపోయే అవసరముండదు. ఇదే మనస్సులో నిండవలసిన సమత్వం, బుద్ధిలో నిలవవలసిన స్థిరత్వం. ఏది ఉండినా ఏది లేకపోయినా తన ఆనందానికి భంగం కలగనివ్వనివాడే స్థిరమైన బుద్ధి గలవాడు. అతడే స్థితప్రజ్ఞుడు, సాక్షాత్ భగవత్స్వరూపుడు. స్థితప్రజ్ఞుడు ఎలా ఉంటాడు, ఎలా భాషిస్తాడు, ఎలా సంచరిస్తాడు? అనే ధర్మ సందేహం ధర్మాత్ముడైన అర్జునుడికే కలిగింది. గహనమైన గురుదేవుని ఆంతర్యపు లోతుల్ని సామాన్యుడైన శిష్యుడు గుర్తించలేడు. ఉప్పు బొమ్మ సముద్రలోతుల్ని కొలవ గలదా? గురు వైభవాన్ని దర్శించాలంటే ముందు మన బుద్ధి శుద్ధిపడి ఉండాలి, స్థిరపడి ఉండాలి. చంచలమైన మనోబుద్ధులు మహాత్ముల వైభవాన్ని గుర్తించలేవు.

సదా అద్వైత భూమికల్లో విహరించే గురుదేవులు సుమారు 100కు పైగా భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రతిపాదించే పాటలను, తత్త్వాలను వ్రాసారు, పాడారు. కాని ఒక పండుగ మీద గురుదేవులు పాట వ్రాయడం ఇదే ప్రథమం. రోజుకొక విధంగా గడిపే మనలాంటి సామాన్యులకి పండుగ ఒక ప్రత్యేకమైన రోజు. నిత్యానంద స్వరూపులైన గురుదేవులకు ప్రతి రోజు పండుగే. ఏదో కావాలి, మరేదో రావాలి అని అహర్నిశం అల్లాడేది మనం. మరి ఆప్తకాములు, నిత్యతృప్తులు అయిన గురుదేవులు, 'కావాలి రావాలి దీపావళి' అంటూ ఆశగా, ఆశువుగా దీపావళిని పిలవడం ఎవరికోసమో, ఎందుకోసమో ఈ పల్లవిలోనే మనకు ప్రస్ఫుట మౌతుంది. జ్ఞానికి తనకంటూ సుఖదుఃఖాలు లేవు కనుక అందరి సుఖదుఃఖాలు ఆయనవే. తన కోసం తాను జీవించడు కనుక అందరి జీవితాలు ఆయనవే. ఎవరి జీవితంలో చీకటి ముసిరినా ఆయన చూడలేడు. ఎవరి హృదయంలో దుఃఖం నిండినా ఆయన భరించలేడు. ఆయన అందరివాడు, తాను మాత్రం ఒంటరివాడు. అందరూ తనవారే, తాను మాత్రం ఎవరికీ చెందనివాడు. ఇదే మహాత్ముని జీవిత రహస్యం. ఇదే నిజమైన జీవన రహస్యం.

**కావాలి రావాలి దీపావళి!**

**చీకటి ముసిరిన బ్రతుకుల తిమిరాలను తరుముటకు ॥ కావాలి ॥**

బాహ్యాభ్యంతరాలలో కూడా చీకటి అవాంఛనీయం. బాహ్యంలో తిమిరాలను దీపావళి తరిమికొడితే బుద్ధిలోని అంధకారాన్ని గురు భాస్కరుడు తొలగిస్తాడు. వాకిటిలో

వెలుగులను చిరు దీపాలు విరజిమ్మితే, బ్రతుకులలో వెన్నెలలను గురు చంద్రుడు పూయిస్తాడు.

పరమాత్మ సృష్టి పరమ పవిత్రమైంది. పంచభూతాలలో ఏది ఉంచాడో పాంచ భౌతికమైన దేహంలోనూ అదే ఉంచాడు. బాహ్యాభ్యంతరాలను సమరస పరుచుకొని వ్యష్టిలోను సమిష్టిలోను సుఖశాంతులను నింపమన్నాడు. అందుకే పంచభూతాలలో ఒకటైన అగ్ని మనలో వైశ్వానరుడిగా ఉండి దేహానికి వేడినిస్తూ, ఆహారాన్ని జీర్ణింపజేస్తూ, మనకు ప్రాణాధారమై ఉంది. ప్రాణం పోయిన తరువాత కూడా చితిలో దహించుకు పోయేందుకు దేహానికి తోడ్పడుతూ ఉంది. కానీ, మనిషి మనస్సులో పుట్టిన ద్వేషాగ్ని బ్రతికి ఉండగానే మనిషిని దహించివేస్తూ ఉంది. దావాగ్నిలా బైటికి ప్రాకి లోకంలో మారణహోమాలను సృష్టిస్తూ ఉంది. అగ్నిహోత్రం వల్ల హోమాలు. ద్వేషాగ్ని వల్ల మారణ హోమాలు. పరమాత్మ సృష్టించిన అగ్ని లోకానికి మంగళకరమైతే మనిషిలో పుట్టిన అగ్ని లోకంలో అమంగళాన్ని సృష్టిస్తూ ఉంది. మనస్సులో కార్చిచ్చులు రగిలే మనుషులు ప్రపంచంలో చలువ పందిళ్ళను వేయగలరా? అందుకే,

**మనసున తాపాలు మహిలో కలహాలు, మనుషుల నడుమ మారణహోమాలు**
**మారాలని పోవాలని సందేశ మిచ్చేదే కావాలి రావాలి దీపావళి!**

అంటూ నిప్పు ఉండేది జీవితాల్ని తగలబెట్టేందుకు కాదు, వంట చేసుకొని ఆకలి మంటను ఆర్పుకొనేందుకు, చిరుదీపాలను వెలిగించి చీకట్లను పోగొట్టుకొనేందుకు అనే సందేశాన్నిస్తూ, మంగళకరంగా, ఆనందప్రదంగా మన మధ్యకు రమ్మని దీపావళిని ఆహ్వానిస్తున్నారు పూజ్య స్వామిజీ.

అల అల్పమైనది. సముద్రం పూర్ణ మైనది. అలలాగా అహంకారం లేచి పడుతున్నంత వరకు మనస్సులో అలజడి తప్పదు. అలజడులు అణగారి మనస్సు పూర్ణరూపం దాల్చినప్పుడే శాంతి సాగరంలో మనిషి ఓలలాడగలడు. అందరికి నరకాన్ని సృష్టించే నరకాసురుడు అహంకారానికి ప్రతిరూపుడు. అహంకారం వల్ల అరిషడ్వర్గాలు, అరిషడ్వర్గాలు ముదిరితే రాక్షస ప్రవృత్తులు. ద్వాపరం నాటి నరకాసురుడు తన ఆగడాలతో, అకృత్యాలతో మూడు లోకాలను తల్లడిల్ల చేసాడు. ఆంతర్యంలో పుట్టిన అహంకార నరకాసురుడు దేహ మనోబుద్ధులు అనే మూడు స్థాయిల లోను నరునికి నరకాన్ని సృష్టిస్తూ ఉన్నాడు. అహంకార నరకాసురుని అంతమొందించ గలవాడు అరి సూదనుడైన అచ్యుతుడే. అజ్ఞానం వల్ల పుట్టిన అహంకారం జ్ఞానం వల్లనే నశించాలి. అందుకే,

**నరక దానవుడు దాగెను లోలోన, వేదన తిమిరాలు పరచెను మనలోన**
**చీకట్లను పారద్రోలు శ్రీకృష్ణ జ్యోతి, కావాలి రావాలి దీపావళి!**

అంటూ, ప్రజ్ఞాన ఘన స్వరూపుడు, సదానందరూపుడు అయిన శ్రీకృష్ణ పరంజ్యోతిని



మనస్సులలో నిలిచి మమతలను తొలగించమని ఆవాహనం పలుకుతున్నారు పూజ్య స్వామిజీ.

సూర్యచంద్రులు, తారల తోరణాలు దివిలో వెలిగే దీపాలు. ప్రకృతి మాత పరమాత్మకు పట్టే హారతులు. తొలి సంధ్యలో, మలి సంధ్యలో పరమాత్మ సన్నిధిలో మనం వెలిగించేవి భక్తి దీపాలు. స్థూల ప్రపంచాన్ని చూసేందుకు ప్రపంచమంత వెలుగు అవసరమేమో గాని, గుడిలో పరమాత్మ రూపాన్ని దర్శించేందుకు గోరంత దీపం చాలు. ఏ పరంధాముని సూర్యచంద్ర తారకలు, విద్యుత్తు కూడా ప్రకాశింపచేయలేవో, ఏ దివ్య పురుషుని అనుసరించి ఈ సమస్తము ప్రకాశిస్తూ ఉందో, అట్టి పరమాత్మ రూపాన్ని దర్శించేందుకు భక్తుడు వెలిగించే కర్పూర హారతి చాలునేమో! మనస్సు ద్వంద్వాలకు నిలయం. ద్వేషాగ్ని రగిలినా ప్రేమ దీపం వెలిగినా మనస్సులోనే. ద్వైత భావాలతో మనం చూసేది భేదరూప జగత్తునే. దృష్టిలో సమత్వం నిలవాలంటే బుద్ధిలో జ్ఞానం వెలగాలి. జ్ఞాన దృష్టే ప్రేమ దృష్టి. అదే సమ దృష్టి. అందుకే,

**ధరణిలో వెలగాలి సమతా జ్యోతి, మనసులో నిలవాలి మంగళ హారతి**
**ప్రేమను గుండెలలో నిలిపే దీపం, కావాలి రావాలి దీపావళి**

అంటూ, దీపావళి వచ్చేది అమావాస్య నాటి రాత్రే అయినా జ్ఞాన వెలుగులో మనలను నిలపమని, వేదాంత వెన్నెలలో మనలను తడపమని కృష్ణచంద్రుణ్ణి ప్రేమతో వేడు కుంటున్నారు పూజ్య స్వామిజీ.

మహిమను చూపగలవారే మహిలో మహిమాన్వితులు. మహిమ అంటే ఉన్నవి మాయం చేయడం, లేనివి కల్పించడం కాదు. ఉన్నదానిని ఉన్నట్లుగా చూపెట్టి లేనిదానిని లేనట్లుగా నిరూపించడమే మహిమ. ఇది మాయలు చేయడం వల్ల, మాటలు చెప్పడం వల్ల సాధ్యపడదు. 'నీ కళ్ళను కప్పిన మాయను నేను తొలగిస్తాను, ఈ లోకం నుండి నిన్ను ఉద్ధరిస్తాను' అని ఎవరైనా పలికితే అది హాస్యాస్పదమే. ఎందుకని? మాయ అంటే అసలు లేనిదే. లేనిదానినే మాయ అంటారు. కాబట్టి లేని మాయను తొలగించడ మేమిటి? మసక చీకటిలో ఉన్న త్రాడు ఉండనే ఉంది. ఇది సత్యం. లేని పాము కనపడుతూ ఉంది. ఇది మాయ. పామును చూస్తున్న వ్యక్తిలో భయాన్ని పోగొట్టాలంటే ఎవరైనా చేయగలిగింది ఏమిటి? లేని పామును చంపడమా లేక ఉన్న త్రాడును చూపడమా? లేని పామును చంప నవసరం లేదు, అది లేనిదే కనుక. ఉన్న త్రాడును సృష్టించే పనిలేదు. అది ఉన్నదే కనుక.

పాము కనిపించింది మసక చీకటి కల్పించిన భ్రాంతి వల్ల కనుక చీకటిని వెలుతురు ద్వారా పోగొట్టడ మొక్కటే మార్గం. కాబట్టి పామును చంపేందుకు కర్ర లెత్తుకొచ్చిన వారు, దానిని వశపరచుకునేందుకు నాద స్వరాలు ఊదినవారు, అరుపులతో బెదరగొట్ట

జూచిన వారు బాటసారికి మేలు చేసిన వారు కారు. దీపం తెచ్చి, చీకటిని పోగొట్టి ఉన్న త్రాడును ఉన్నట్లుగా చూపెట్టినవాడే జ్ఞానవంతుడు. అతడే గురువు. కాబట్టి ఏదేదో సృష్టించేవారు గురువులా, లేక ఉన్న సత్యాన్ని చూపెట్టేవారు గురువులా అనేది ఎవరికి వారు నిర్ణయించుకోవలసిన విషయం. ఇది నిర్ణయింపబడాలి అంటే ముందు మనకేమి కావాలో మనకు తెలిసి ఉండాలి. ఇదే పురుషార్థ నిశ్చయం. మోక్షమే పరమ పురుషార్థ మని, అది కేవలం జ్ఞానం వల్లనే ప్రాప్తమని నిశ్చయించుకున్న ముముక్షువు పలు మార్గాలలో పరుగులెత్తడు. చేతి యందు ఆర్షధర్మ జ్యోతిని ధరించి ఉన్న శ్రోత్రియ బ్రహ్మనిష్ఠు డైన గురువునే ఏకైక శరణ్యంగా ఆశ్రయిస్తాడు. గురు మహిమ అంతా అతని బోధలోనే నిండి ఉంది. గురువును పొందడం అంటే జ్ఞానాన్ని పొందడం అని అర్థం. నా కన్నా అన్యంగా గురువు దేనిని సృష్టించి ఇచ్చినా అది మహిమ కాలేదు. నన్ను నాకు అందించిన గురువే నిజమైన గురువు. అందుకే,



**మాయలు మాటలు మహిమలు కాలేవు, స్వరూప బోధయే కామధేనువు**
**భువినంతా దివి చేసే ఆర్షధర్మ జ్యోతి, కావాలి రావాలి దీపావళి!**

అంటూ, ఆర్షధర్మ వైభవాన్ని, గురుబోధ ప్రాభవాన్ని కొనియాడుతూ, ఆత్మజ్యోతి దర్శనంతో తరించిపొమ్మని దీపావళి ఆశీస్సులను మనకు అందిస్తున్నారు కరుణా మయులైన మన గురుదేవులు.

**జై జై గురుదేవ!**





# జగద్గురు జీవితము

ధారావాహిని-6

స్వామి సుందర చైతన్యానంద

## శ్రీ శంకర మండనమిశ్ర సంవాదము



భాష్యాలు రచించటానికి బదరికాశ్రమం చేరారు జ్ఞాన భాస్కరులైన శ్రీశంకరులు. పన్నెండు ఉపనిషత్తులకు, బ్రహ్మసూత్రాలకు, భగవద్గీతకు, సనత్సుజాతీ యానికి భాష్యాలు బదరికాశ్రమం లోనే రచించారు.

భాష్య రచనలతో పాటు ఆచార్యులను దర్శించ టానికి వచ్చే ముముక్షువుల కొరకు కొంత సమయం వెచ్చించి తమ జ్ఞానబోధ ద్వారా వారి సంశయాలను శ్రీశంకరులు నివృత్తి చేస్తుండే వారు.

ఒకనాడు ముముక్షువుల మధ్య కూర్చుని ఉన్న ఒక వృద్ధ బ్రాహ్మణుడు బ్రహ్మసూత్రాలపై కొన్ని సందేహాలను శంకరుల ముందు ఉంచారు. శంకరాచార్యులు సమాధానాలు ఇచ్చారు. అయినా ఆ వృద్ధుడు సంతృప్తి చెంద లేదు. శంకరులతో వాదం చేయ సాగాడు. ముగింపు తెలియని ఈ వాదాలను మదింపు వేసే వారు లేక పోయారు. రోజురోజుకీ వాదోపవాదాలు పెరిగి తీవ్ర రూపం ధరిస్తున్నాయి. కుదింపులకు కుదరని, తెగింపులకు తేలని ఈ సాధింపులను ఆపే శక్తి ఎవరికీ లేకుండా ఉంది.

శ్రోతలు విసుగు చెందుతున్నారు. శంకరుల వారి శిష్యులలో అతి ముఖ్యులైన పద్మపాదాచార్యులు ధ్యానమగ్ను లైనారు. వెంటనే వారికి ఆంతర్యంలో సత్య దర్శనమైంది. బ్రహ్మసూత్రాలను రచించిన వ్యాసుడే వృద్ధుని రూపం ధరించి వాదిస్తున్నా డని అవగతమైంది. వాదం సాగుతున్నది. పద్మపాదుడు ఆచార్యు లిరువురికి నమస్కరిస్తూ నిలబడి ఒక శ్లోకం గానం చేశారు.

*శంకరః శంకర స్సాక్షాత్*
*వ్యాసో నారాయణః స్వయమ్ ।*
*తయో ర్వివాదే సంప్రాప్తే*
*కింకరః కిం కరో మ్యహమ్ ॥*

వ్యాసమహర్షి నారాయణుని అవతారం. శంకరాచార్యులు శివావతారం. అట్టి మహాత్ములే వాదించుకొంటుండగా నా బోటి కింకరుడు ఏమి చేయగలడు?

వ్యాస భగవానుడు నిజరూపం ప్రదర్శించారు. దర్శన మిచ్చారు. శంకరులు రచించిన బ్రహ్మసూత్ర భాష్యం అమోఘం. అద్వితీయ మని వ్యాసభగవానుడు శ్లాఘించారు. వ్యాసుని ఆమోదం పొందిన బ్రహ్మసూత్ర భాష్యం విశ్వామోదమైంది. ప్రమాదాలను తొలగించి ప్రమోదం అందించింది. శాస్త్రావగాహనకు బాట సుగమం చేసింది.

ఆచార్యులు వ్యాసదేవుడికి నమస్కరించారు. భాష్య రచనలు సమాప్త మయ్యాయి. వచ్చిన కార్యం పూర్తి అయింది. పదుగురు మెచ్చే విధంగా, పది కాలాలకు నచ్చే విధంగా పనికొచ్చే విధంగా భాష్యాలు సిద్ధ మయ్యాయి. ఇక తమ అవతారం సమాప్తి చేయ సంకల్పించారు శ్రీ శంకరులు. అందుకు వ్యాసుని ఆశీర్వాదం అర్థించారు. కానీ వ్యాసులు అందుకు అంగీకరించ లేదు.

రచనలు పూర్తి చేయడంతో ఆచార్యుల కర్తవ్యం పూర్తి కాదు. తమ రచనలు ముముక్షువులలో అర్చనలుగా మారేటట్లు చూడవలసిన బాధ్యత కూడా వారిపై ఉంది. రచనలలో నిక్షిప్తం చేసిన జ్ఞానరత్నాలను విశ్వంలో ప్రదర్శింప వలసినది కూడా ఆచార్యులే. పర్యటనలు సాగించాలి. పుస్తకాలలో నిండిన జ్ఞానాన్ని మస్తకాలకు ఎక్కించాలి. అని పలికి మరో పదహారు సంవత్సరాలు శ్రీ శంకరులకు జీవిత కాలాన్ని పొడిగించి ఆశీర్వదించారు వ్యాస భగవానులు. ఈ సంఘటన జరిగిన నాటికి శ్రీశంకరులు పదహారు సంవత్సరాల యువకులు.

వ్యాసుని ఆజ్ఞానుసారం శిష్యులతో కూడి పర్యటన ప్రారంభించారు శంకరాచార్యులు. కురుక్షేత్రం, ఇంద్రప్రస్థం, మధుర, బృందావనం, ద్వారక, ప్రయాగ మొదలైన పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ విశ్వరూపుడు వసించే మహిష్మతీ పురానికి వచ్చారు.

విశ్వరూపుడే మండనమిశ్రుడు. కర్మమార్గానుయాయి. నివృత్తి మార్గమును నిరసిస్తూ, నిరాకరించే విశ్వరూపునితో వాదించటానికి ఆచార్యులు మహిష్మతీ పురానికి వచ్చారు.

పురంలో ప్రవేశిస్తూ నది నుండి కడవలతో నీరు తెస్తున్న వనితలను మండన మిశ్రుని గృహం ఎక్కడని ప్రశ్నించారు శ్రీ శంకరులు. శంకరులు వాక్యంతో ప్రశ్నిస్తే వనితలు శ్లోకంతో సమాధాన మిచ్చారు.

*స్వతః ప్రమాణం పరతః ప్రమాణం కీరాంగనా యత్ర చ సంగిరన్తె,*
*ద్వారస్థానీ దాన్తర సంనిరుద్ధా జానీః తన్మండన పండితౌకః ॥*

'ఎవరి గృహద్వారం వద్ద పంజరం లోని చిలుకలు స్వతః ప్రమాణం, పరతః ప్రమాణం అనే శాస్త్ర విషయాలను చర్చిస్తూ ఉంటాయో ఆ గృహమే మండన మిశ్రుని గృహ' మని వనితలు తెలిపారు.

మండనమిశ్రుడు నివసించే పురంలో వనితలు కవిత అల్లుతారు. చిలుకలు శాస్త్రాలను చర్చిస్తాయి. పరమాశ్చర్యంతో ఆచార్యులు మండనమిశ్రుని ఇంటిని సమీపించారు.



గృహద్వారం మూయబడి ఉంది. తమ యోగమహిమ ద్వారా శ్రీ శంకరులు లోపలికి ప్రవేశించారు. ఆ సమయానికి మండనమిశ్రుడు శ్రాద్ధవిధిని ఆచరిస్తున్నారు. పూర్వమీమాంసకర్త జైమిని, ఉత్తర మీమాంసకర్త వ్యాస భగవానుడు బ్రాహ్మణార్థం వచ్చి ఉన్నారు.

మండనమిశ్రుడు సన్యాసి అయిన శంకరులను చూసి మండిపడ్డాడు. **కుతో ముండీ?** 'ఈ బోడితల ఎక్కడ నుండి?' అని ప్రశ్నించాడు. 'కంఠం నుండి' అని శంకరులు సమాధాన మిచ్చారు.

**మార్గం పృచ్ఛతే మయా.** 'శాస్త్రం అనుసరించే నీ మార్గం అడుగు తున్నాను' అని మండనమిశ్రు డన్నారు. 'మార్గం మాట్లాడునా? మాట లెరుగునా?' అని శంకరులు అన్నారు.

కోపించిన మండనమిశ్రుడు **సురాపీత?** 'కల్లు త్రాగితివా?' అని అడిగారు. **సురనీ పీతః, శ్వేతః.** 'కల్లు పసుపువర్ణం కాదు. తెలుపు వర్ణం' అని శంకరులు పలికారు. **పీత** అనగా పసుపురంగు, త్రాగుట అని రెండు అర్థాలు. 'సన్యాసికి కల్లు వర్ణం తెలిసినదే?' అని మండనమిశ్రుడు పలుకగా 'నాకు రంగు మాత్రమే తెలుసు. నీకు గుణం కూడా తెలుసు' అని సమాధానం ఇచ్చారు శంకరులు.

వాదం పెరుగుతున్నది. జైమిని వ్యాసాదులు సమయానికి వచ్చిన సన్యాసిని బ్రాహ్మణార్థానికి ఆహ్వానించమని చెప్పారు. మండనమిశ్రుడు ఆహ్వానించాడు. శంకరులు వాదభిక్ష కోరారు. మండనమిశ్రుని భార్య ఉభయభారతిని మధ్యవర్తినిగా నియమించారు జైమిని వ్యాసాదులు.

ఆమె రెండు పూలమాలలను తెచ్చి వారిరువురికి సమర్పించింది. ఎవరి మెడ లోని పూలమాల వాడిపోతుందో వారు ఓడిపోయినట్లుగా నిర్ణయించింది. పాతివ్రత్య మహిమ అమోఘం. అద్భుతం. శంకర మండనమిశ్రుల మధ్య ఇరవై రోజులు పూర్తిగా వాదం సాగినది. ఆ మరునాడు మిశ్రుని మెడ లోని మాల వాడి పోయింది.

మండనమిశ్రుడు శంకరులకు శిష్యు డయ్యాడు. ఆయనే మున్ముందు 'నైష్కర్మ్య సిద్ధి' అనే మహోత్కృష్ట మైన గ్రంథరాజం ప్రపంచానికి అందించిన సురేశ్వరాచార్యులుగా మారి శృంగేరి మఠానికి అధిపతు లయ్యారు.

రెండవ శిష్యుడైన సురేశ్వరుని పొందిన పిదప శ్రీ శంకరులు దక్షిణ రాజ్యము లను-సందర్శింపగోరి నాసిక్ చేరి అచ్చట రామాయణము నందు తెలిపిన పంచవటిని దర్శించి, పండరీపురం చేరి, చంద్రభాగాలో స్నాన మాచరించి, విఠలుని దర్శించి, అక్కడ నుండి శ్రీశైలము చేరారు. అచ్చట కాపాలిక నాయకుడైన ఉగ్రభైరవుడు ఆచార్యుల వారిని కలిశాడు. తనకు చక్రవర్తి యొక్క శిరము గాని లేదా సన్యాసి యొక్క శిరము గాని కావలె

నవియు, మొదటిది లభ్యమయ్యే అవకాశము లేనందున రెండవది అనుగ్రహించమని శ్రీ శంకరులను కోరాడు. కరుణా మయులైన శ్రీ శంకరులు అందుల కంగీకరించారు. ఆనాటి రాత్రి ఆచార్యులను బలిపీఠము ముందుంచి శిరచ్ఛేదము చేయు ప్రయత్నములో భైరవు డుండగా, ఈ విషయమును పసికట్టిన పద్మపాదాచార్యులు నరసింహస్వామిని ప్రార్థించారు. ఉగ్రనరసింహుని అనుగ్రహము వలన కాపాలికుని శిరస్సు ఛేదించ బడింది. శ్రీ శంకరులు రక్షించ బడ్డారు.

శ్రీశైలములో శ్రీ శంకరుల వారు 'శివానందలహరి' అనే గ్రంథమును పూర్తి చేసి, అక్కడ నుండి గోకర్ణము చేరారు. అచ్చట నుండి హరిహరపురము ద్వారా మూకాంబికా క్షేత్రమును చేరారు. అచ్చట తమ ఒక్కగానొక్క బిడ్డడైన కుమారుని మృతదేహము పైబడి విలపిస్తున్న దంపతుల దీనావస్థను గాంచి, వారి దుఃఖమును ఉపశమింప జేయుమని శ్రీశంకరులు మూకాంబికాదేవిని ప్రార్థించగా, అనుగ్రహించిన దేవి ఆ బాలుని పునర్జీవింప జేసింది. ఆ తరువాత శ్రీబాలి అను గ్రామము చేరారు. ఇక్కడే మూడవ శిష్యుడైన హస్తామలకుడు శ్రీ శంకరులను కలియుట జరిగింది.

సాగరమున కలిసేందుకు పరుగులిడు జీవనదిలో కలిసే కాలువలు ధన్య తమములే కదా!

**(సశేషం)**





# మంగళ దీపాలు

ధారావాహిని-19

**స్వామి సుందర చైతన్యానంద**

## అసమాన ప్రతిభ

శ్లో॥ బాలోఽపి శైలోద్ధరణాగ్ర పాణిః
నీలోఽపి నీరన్ధ్ర తమః ప్రదీపః ।
ధీరోఽపి రాధా నయనావ బద్ధో
జారోఽపి సంసార హరః కథస్త్వమ్ ॥

**భావము:**

కృష్ణా! నీవు బాలుడవైనా గోవర్ధన గిరి నెత్తి పట్టితివి. నల్లని వాడవైనా కటిక చీకటికి దీపమై ఉన్నావు. ధైర్యము గల వాడవైనా రాధ చూపులకు లోబడితివి. జారుడవైనా సంసార మోచకుడవై ఉన్నావు. ఇది ఏమి మహిమో నేనెరుగకున్నాను.

**వ్యాఖ్య**

శ్రీకృష్ణుడు మానవ మాత్రుడని అధమ సంస్కారులు పలుకుతుంటారు. అతడు ఉత్తమ మానవుడు అని మధ్యమ సంస్కారులు వచిస్తుంటారు. శ్రీకృష్ణుడు సాక్షాత్తు పురుషోత్తముడే అని ఉత్తమ సంస్కారులు మాత్రమే ప్రవచించగలరు. శ్రీకృష్ణ పరమాత్మ యొక్క దివ్యత్వానికి ఈ శ్లోకంలో ప్రమాణం అందుతుంది.

శ్రీకృష్ణుడు ఏడు సంవత్సరాల బాలుడుగా ఉన్న దశలో గోవర్ధన పర్వతాన్ని ఏడు రోజులు చిటికెన వేలుపై ఎత్తి పట్టినాడు. ఇది సామాన్యులకు వీలు కాదు. అసమాన్యులకూ అలవి కాదు. అది ఒక్క అపురూప చైతన్యవంతునికే సాధ్యం. అందుచేత శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవంతుడు అని చెప్పక తప్పదు.

శ్యామసుందరుడు నల్లని మేనువాడు. అయితే నేమి? తన రాకతో చీకట్లు మటుమాయ మయ్యేవి. నిత్యనూతన కాంతులీనుచూ శ్రీకృష్ణుడు నడచి వస్తుంటే అంధకారం అదృశ్య మయ్యేది. ఇది విడ్డూరంగా ఉంది కదూ? నల్లని వాడు నల్లని చీకట్లను ఎలా పోగొట్టగలడు? తాను భగవంతుడు అగుటచేత.

ధీరుడైనా మురళీ మనోహరుడు రాధ చూపులకు లోబడినాడని కవి చమత్కరిస్తున్నాడు. శ్రీకృష్ణుడు పరమాత్మ అనడానికి ఇది సత్య ప్రమాణం. భక్తులకు భగవంతుడు ఎప్పుడూ వశుడే కదా! పరమాత్మ భక్త పరాధీనుడు.

శ్రీకృష్ణుడు జారుడని అసంస్కారులు ఆయనపై అభియోగాలు మోపుతుంటారు. అదే నిజమైతే అతడు సంసార మగ్నులైన వారిని ఎలా తరింపజేయగలడు? ఇది ఎలా సాధ్యపడుతుంది? ఇవి అన్నీ సాక్షాత్తు పరమాత్మ అగుట వలన శ్రీకృష్ణుడొక్కడికే సాధ్యము.

*(19వ పేజీ చూడుము)*

# ఓ కథ చెప్పనా!

**స్వామి సుందర చైతన్యానంద**

## ఆశకు ఆకలి తీరదు



పూర్వం ఒక రాజు గారు తన కొలువు లోని పండితుల బుద్ధిని పరీక్షించాలని సంకల్పించి వారికి ఒక పరీక్ష పెట్టాడు. ఆ పరీక్షలో నెగ్గిన వారికి విలువైన ప్రశస్త మణిహారమును బహూకరించడం జరుగుతుందని కూడా ప్రకటించాడు.

పరీక్ష యొక్క పూర్వాపరాలను మంత్రిగారు సభ లోని పండితులకు ఈ విధంగా వివరించి చెప్పాడు. కొలువు కూటములో ఒక మేకను ప్రవేశ పెడతారు. దానిని తృప్తిగా మేపాలి. మేతను సంస్థానమే సమకూర్చుతుంది. మేత పెట్టి, మేకను తృప్తి పరచి, ఏలే వారిని మెప్పించడమే పోటీలో పాల్గొనే వారు చేయవలసిన పని. ఎవరు మేకను తృప్తి పరిస్తే వారికి అమూల్యమైన రత్నహారము లభిస్తుంది.

మరునాడు పోటీ ప్రదర్శనము ఆరంభమైంది. మేకను పూలమాలతో అలంకరించి కొలువులో ప్రవేశ పెట్టారు. ప్రథమంగా ఒక పండిత శ్రేష్ఠుడు ముందు కొచ్చి, పచ్చి గ్రాసమును, మేతను మేక ముందు వేశాడు. అది శుభ్రంగా మేసింది. ఉదయం నుండి సాయంత్రం వరకు అతడు మేత వేస్తూనే ఉన్నాడు. అది మేస్తూనే ఉంది. పొట్ట పెద్ద బానలా బిఱ్ఱుగా తయారైంది. అయినా, పచ్చగడ్డి వేయగానే మేక మూతి పెడుతూనే ఉంది. చీకటి పడింది. పండితుడు ఓడిపోయాడు. ప్రదర్శనము మరునాటికి వాయిదా పడింది.

రెండవ రోజు మరొక పండితుడు, మూడవ రోజు, నాల్గవ రోజు - ఇలా తొమ్మిది రోజులు గడిచాయి. తొమ్మిది మంది పండితులు విఫల ప్రయత్నాలు చేశారు.

పదవ రోజు పోటీలో పాల్గొనిన వ్యక్తి, పూర్వం పోటీలో పాల్గొనిన పండితుల లాగా మేతను ఎక్కువగా మోసుకు రాలేదు. కొద్ది గ్రాసమును మాత్రమే చేతిలో పట్టుకొని కొలువు లోకి ప్రవేశించాడు. ఆ గ్రాసమును మేక ముందు పడేశాడు. మేక యథా ప్రకారం తల వంచి తినడానికి మూతి ముందుకు చాచింది. అంతే. ఆ వ్యక్తి తన నడుముకు కట్టుకొని



ఉన్న కొరడాను తీసి మేకపై ఛడేలు మనిపించాడు. తినడానికి ముందు కెళ్ళిన మేక ఉలిక్కి పడి వెనక్కి తగ్గింది.

కొన్ని నిముషాలు ఆగి, మళ్ళీ తినడానికి ముందు కొచ్చింది. మేత దగ్గరకు మూతి వచ్చినప్పుడల్లా మేక వీపు ఛడేలు మంటోంది. సాయంత్రం వరకు ఇదే వడ్డింపు. సాయంత్రం రాజు గారు వచ్చారు.

మహారాజా! ఈ మేకను నేను తృప్తిగా మేపినాను. నాకు బహుమానం ఇప్పించండి అన్నాడా వ్యక్తి. ఇంతవరకు జరిగిన ప్రదర్శనలలో చివరిగా రాజు గారు రావడము, తన చేతితో కొంత పచ్చి గ్రాసమును మేక ముందు వేయడము, అది ఆరగించడము, పోటీదారుడు ఓడిపోయినట్లు ప్రకటించడము జరుగుతూ వచ్చింది.

అలాగే, ఈ రోజు కూడా రాజు గారు మేక ముందు కొంత మేతను పడేయడం జరిగింది. మేక మెల్లగా ఆ మేతను సమీపించి, తినడానికి మూతిని ముందుకు చాచింది. తీరా తినేస్తుందని రాజు గారు భావిస్తూ ఉండగా, అది తినకుండా వెనక్కి తిరిగి వచ్చేసింది. రాజు గారు ఆశ్చర్య పోయాడు. మేకను ఇతడే తృప్తిగా మేప గలిగాడు అని నిర్ణయించి, అతనికి అమూల్య రత్నహారాన్ని బహూకరించాడు.

పెట్టినంత వరకు, ఎంత పెట్టినా తృప్తి లేకుండా మేక తింటూనే ఉండింది. కొట్టడం మొదలెట్ట గానే తినడం కట్టి పెట్టింది. ఇంద్రియాలు కూడా అంతే. పైగా, ఇవి మేకలు కావు, గుఱ్ఱాలు. శక్తివంత మైనవి. మేకల లాగా తల వంచుకొని పడి ఉండేవి కావు. అవసరమైతే తిరగబడి విజృంభిస్తాయి కూడా.

నివేదిస్తూ ఉంటే ఇంద్రియాలు నీల్గుతూనే ఉంటాయి. నిగ్రహించి నపుడే బుద్ధిగా దారి లోకి వస్తాయి. ఆదమరిస్తే చాలు, అమాంతం హరిస్తాయి. సంక్షోభాన్ని సృష్టిస్తాయి.

---

*(17వ పేజీ తరువాయి)*

బండ బరువును మోపినవాడు నీ బ్రతుకు బరువును మోయలేడా? కొండను మోసిన వాడు నీ కొంపను ఉద్ధరించలేడా? నల్లని చీకట్లను పోగొట్టిన శ్యాముడు నీ లోని అజ్ఞాన చీకట్లను పారద్రోలే పరంజ్యోతి యని మరువకు. జారత్వము చోరత్వము శ్రీకృష్ణుని యందు లేవు. ఆయన అస్ఖలిత బ్రహ్మచారి. అందుకే నెమలి పింఛమును ధరిస్తాడు. ఆయన చోరుడు కాదు. వెన్నదొంగ కాదు. నీ మనస్సనెడి నవనీతమును అపహరించి నిన్ను కడతేర్చే అమృత హృదయుడు.

# అలౌకిక రసధామం - ఆశ్రమ శృతిమందిరం

**శ్రీ జె. బ్రహ్మం**

గతి తప్పిన జీవితాల
శృతి చేయు మందిరం
మాధవ కృప చేత మహిలో
వెలసిన శృతిమందిరం ॥ గతి ॥

వేదవ్యాసుని జ్ఞానం
చల్లని వేదిక కాగా
ఆదిశంకరుల భాష్యం
ఆచ్ఛాదనమై నిలువ
సుందర చైతన్య స్వామి
సుమధుర బోధల మహిమ
వేదభాస్కరుని కాంతులు
వేదికపై విరజిమ్మ ॥ గతి ॥

యమునాతీర వనాన
వంశీమోహన రాగం
ద్వారక మధురలు ఒకటై
కనిపించే వైభవం
గీతాజ్ఞాన వైభవ
వేదికయే కైవల్యం
సజ్జన సాంగత్య సదన
సుందర బృందావనం ॥ గతి ॥

అందని ఆనందీశ్వర
సంధానం స్వామి ధ్వజం
మహికే శోభను కూర్చె
ఘనశ్యాముని మందిరం
జ్ఞానమే ప్రధానమైన
సుందర శారద ధామం
ఆశ్రితులను ఆదరించే
అన్నపూర్ణా సదనం ॥ గతి ॥

భాగవత కథా గంగ
ప్రవహించిన దీచోట
రాముని రసరమ్యకథ
రాగమైనదీ చోట
భవ్యకథ భారతంతో
బ్రతుకు సాగు పూలబాట
వేణు నాదచైతన్యంలా
స్వామి నోట తేనె పాట ॥ గతి ॥

గుండెగుడిలో గురువు నిలువ
మదిలో మాధవుడు కదల
మనసు లోన శాంతి నింపె
సుందరం గురుమందిరం
కాళిదాసు కావ్యాల
కమనీయ వర్ణనం
సుమబాలల సోయగాల
సుందర ఆశ్రమవనం ॥ గతి ॥

అమృతం త్రాగిన సురులు
అమరు లనగ విన్నాము
జ్ఞాని మృత్యువును చూసి
నవ్వుకొనగ కన్నాము
నరుల నొసటిరాత
రాశాడట ఆ బ్రహ్మ
ఆ రాతను తుడిచేందుకు
అవతరించె జ్ఞానబ్రహ్మ ॥ గతి ॥



# కడుపు తీపి

**స్వామి సుందర చైతన్యానంద**

'లాల పోసుకో తండ్రీ! బువ్వ తిను తల్లీ!' అని తల్లి బిడ్డల్ని పిలవడం వెనుక దాగియున్న కడుపుతీపి మనిషి మాటలకు అందేది కాదు. జన్మనిచ్చేవారు తల్లిదండ్రులు. కాని, తాను జన్మనిచ్చిన వారిని తల్లి, తండ్రి అని సంబోధించడం ప్రేమలో ఒక పరాకాష్ఠ.



గర్భము దాల్చకపోయినా, శ్రమించి కన్నది కాకపోయినా, పురిటి స్నానాలు, నడికట్లు లేకపోయినా సదా సంతానాన్ని ప్రసవించే, ప్రసాదించే పరమాత్మను తల్లిగా సంబోధించడం పుణ్య భారతీయ సంస్కృతిలో భక్తి సాహిత్యం అనుగ్రహించిన, అందించిన అక్షయ సంపద. కాలికి దెబ్బ తగిలినా, కడుపుకు నొప్పి కలిగినా 'అమ్మా!' అనడం, దుస్సాధ్యమైన కార్యాన్ని శ్రమించి సాధించినపుడు, జరగదేమో అనుకున్న మహత్కార్యము జరిగినపుడు "అ....మ్మ" అని కూర్చొని ఛాతీపై చేతులుంచుకోవడం ఒకరు నేర్పితే వచ్చింది కాదు. ఈ స్పందన బళ్ళల్లో, గుళ్ళల్లో నుండి తలవంచి తెచ్చుకున్నది కాదు. గుండె అంత రాంతరాల్లో ఎక్కడినుండో అప్రయత్నంగా కదిలి పైకి వస్తున్న అవ్యక్త ప్రేమ పొంగు.


గత జన్మలో ఒక తల్లి. ఈ జన్మలో మరొక తల్లి. తరించక చతికిలబడితే మళ్ళీ ఎత్తుకొనేందుకు రాబోయే జన్మలో వేరొక తల్లి. తల్లులు మారొచ్చు. కాని, వారందరిలో బిడ్డ కొరకు తల్లడిల్లే స్వభావం మాత్రం మారదు. అది ఎక్కడిది? అని అన్వేషణ ప్రారంభిస్తే, ఆ తరువాత కాలూనేది కైవల్యంలోనే. తల్లుల్ని గన్నతల్లి సన్నిధి లోనే. ఆ సన్నిధే పరమాత్మ సన్నిధి.

పరమాత్మ అందరికీ తల్లి. పాలవెల్లిలో పవ్వళించి బిడ్డల్ని చల్లగా చూచే కల్పవల్లి. జన్మ జన్మలకు వెంట నడిచే జనని. మాయాప్రపంచం వంచించి త్రాగించిన విషాన్ని విరుగుడు చేసే సంజీవని.


పరమాత్మది తీపి కడుపు. అందుకే ఆ దివ్యాత్మునిలో అంతా తీపినే చూస్తున్నాం. **'మధురాధిపతే రఖిలం మధురం'** అని మనసును కరిగించుకొంటూ పాడుతున్నాం. 'పాహి' అనగానే పరుగులెత్తి వచ్చి ప్రక్కన నిలిచే పరమాత్మ కడుపుతీపిని ఏమని వర్ణించాలి? అది వరాల కడుపు. ప్రేమ సరాల కడుపు. పాపులైనా సరే పశ్చాత్తాపంతో పిలిస్తే మారుపలికే పుణ్యాల కడుపు.

***(24వ పేజీ చూడుము)***

## యజ్ఞ పోషకులు




చి॥ జి.ఆనంద ఈశ్వర చైతన్య
హైదరాబాద్, రూ.1,00,000/-



డా॥ శ్రీ బి.బాపు రావు
వరంగల్, రూ.50,000/-

## మహారాజ పోషకులు
(రూ.10,000/-)



డా॥ శ్రీ వి.చంద్రశేఖరం
వైజాగ్, రూ.30,000/-




శ్రీమతి కె.సమత
సింగపూర్
రూ.25,000/-



శ్రీమతి ఎ.భాగ్యలక్ష్మి
శ్రీ ఎ.బాలరాజ్
మహబూబ్‌నగర్
రూ.25,000/-



శ్రీమతి ఎ.మహతి
వైజాగ్
రూ.25,000/-




శ్రీ బి.రఘు
హైదరాబాద్
రూ.25,000/-




శ్రీమతి ఎమ్.మాధవీలత
అమెరికా, రూ.21,000/-




శ్రీమతి పి.పరమేశ్వరి
శ్రీ పి.సతీష్ కుమార్
నిర్మల్, రూ.20,112/-




శ్రీ సి.హెచ్.శంకరయ్య
హైదరాబాద్, రూ.10,000/-




శ్రీ డి.సాయి ప్రసాద్
హైదరాబాద్



శ్రీ కె.పవన్ కుమార్
గుంటూరు



చి॥ ఎన్.శ్రీహిత్
హైదరాబాద్




శ్రీమతి జి.శ్రీవాణి
శ్రీ జి.అశోక్ కుమార్
కరీంనగర్



## రాజపోషకులు
రూ.5,000/-



శ్రీమతి ఎమ్.సులోచన
హైదరాబాద్



శ్రీ జి.నరేందర్
సికింద్రాబాద్



శ్రీమతి డి.సరోజినీ దేవి
వైజాగ్



పి.సంతోషి
హైదరాబాద్




డి.వి.డి.కృష్ణ వర్ధన్
హైదరాబాద్




శ్రీమతి ఎమ్.జానకీ దేవి
రాజమండ్రి




శ్రీమతి ఎ.రోహిణి
ఒరిస్సా



శ్రీ కె.వేదవిజ్వల్
హైదరాబాద్




శ్రీ సి.హెచ్.రూపేశ్ శశాంక్
గుంటూరు



శ్రీ సి.హెచ్.నిఖిల్ కృష్ణ
గుంటూరు



శ్రీ ఆర్.కుమార్
రాజమండ్రి




శ్రీ టి.రామబాబు
చెన్నై



శ్రీ ఎ.రవికిరణ్ రెడ్డి
యు.కె.




శ్రీమతి ఎ.జ్ఞానాంబ
హైదరాబాద్




శ్రీ పి.వీరాస్వామి
హైదరాబాద్




శ్రీమతి కె.సుష్మిత
హైదరాబాద్



శ్రీ సి.సురేందర్ రెడ్డి
వాఘాపూర్




శ్రీ వి.మారుతి
హైదరాబాద్



డా॥ శ్రీ కె.దత్తాద్రి
నిజామాబాద్



చి॥ పి.సత్య కీర్తి
హైదరాబాద్



శ్రీ బి.జ్ఞానేశ్వర్
హైదరాబాద్




శ్రీమతి బి.సరస్వతి
చిక్కబల్లాపూర్



శ్రీమతి మౌనిశ్రీ
వైజాగ్



చి॥ బి.సాన్నిధ్య
హైదరాబాద్



శ్రీ బి.శరత్ చంద్ర
హైదరాబాద్

(21వ పేజీ తరువాయి)



సామాన్యులైనా తనను నమ్మిన వారిని అసమాన ప్రతిభావంతులుగా తీర్చిదిద్ది, వారిచేత అద్భుతకార్యాలను చేయించి శాశ్వత కీర్తిని ప్రసాదించే రత్నాల కడుపు.

బిడ్డకు జన్మనిచ్చిన తల్లిపై బిడ్డను పోషించే భారముంది. తల్లి పోషణలోనే శిశువు పెరుగుతుంది. అలాగే ఈ సృష్టిలోని జీవులందరికి జన్మప్రదాత భగవంతుడే. కనుక పోషకుడు తానే. బిడ్డపై తల్లికున్న ప్రేమ కూడా పరమాత్మ ప్రేమ నుండి అరువు తెచ్చుకున్నదే. సూర్యుని నుండి వెలుగుకిరణాలు ప్రసరించని దెపుడు?

పరమాత్మ నుండి ప్రేమసుధ స్రవించని దెపుడు? ఈ సత్యం తెలియక అంతా తమ భుజాలపైనే ఆధారపడి ఉందని జీవులు ఊగిపోతున్నారు. ఈ కారణంగానే జీవిత ఊయలలో జన్మమృత్యువుల అంచులవైపు సదా ఊగుతూ అలసిపోతున్నారు.

గూటిలోని పిల్లపక్షికి మేత తేవాలని గువ్వ గగనంలో ఎగిరి అరణ్యాలకు వెళ్తుంది. అది తన గూటికి ఎంత దూరమవుతూ ఉంటుందో మనసులో తన బిడ్డకు అంత దగ్గరవుతూ ఉంటుంది. బిడ్డ ఎలా ఉందోనని తల్లడిల్లుతూ ఉంటుంది. గువ్వగుండెలో ఈ ప్రేమను సృష్టించిన పరమాత్మ హృదయం ఎంత ప్రేమతో నిండియుందో చెప్పడం ఎవరికి సాధ్యం?

గ్రద్ద ఆకాశంలో ఎత్తున ఎగురుతూ ఉంటుంది. మధ్యలో క్రిందికి హఠాత్తుగా దిగి మళ్ళీ పైకి వెళ్తుంది. ఎందుకో తెలుసా? క్రింద తన బిడ్డ ఉంది. ఎలా ఉందోననే బెంగ. పక్షికే తన బిడ్డలపై ఇంత ప్రేమ ఉంటే పరమాత్మకు ఎంత ఉంటుంది తన సంతానంపై!

బిడ్డ ఊయలలో పడుకొని ఉంటుంది. తన అవసరాల్ని తాను పట్టించుకోదు. అందుచేత సదా చిరునవ్వును చిందిస్తూ ఉంటుంది. బిడ్డ అవసరాలన్నీ తల్లే పట్టించు కుంటుంది. ఏ సమయానికి నీళ్ళు పోయాలో, ఎప్పుడు పాలు పట్టించాలో తల్లి తెలిసి చేస్తుంది. కనుక బిడ్డ భారం లేకుండా జీవిస్తుంది. " చేసేది నేను" అనుకుంటే అశాంతి. "చేసేది నీవే" అనుకుంటే పరమశాంతి.

తల్లికి బిడ్డపై ఉండేది ప్రేమ. అది దయ కాదు. మా యజమాని నన్ను దయతో



చూసుకుంటాడు అంటారు. వల్లమాలిన దయ యజమానికి సేవకునిపై ఎందుకొచ్చి పడింది? సేవకుని సేవలు యజమానికి తృప్తినిచ్చాయి కనుక. ఒకవేళ సేవలు అందకపోతే యజమాని దయతో చూస్తాడా? చూడనే చూడడు. అలాంటి దయాగుణమా బిడ్డపై తల్లికుండేది? బిడ్డ నుండి ఏమి ఊహించి తల్లి దయ చూపింది? ఆమెకు ఏ ఆశలూ లేవు. బిడ్డనుండి తీరే ఏ అవసరాలూ లేవు. ఆమెదంతా నిస్వార్థ సేవ. కనుక అది దయ కాదు. ప్రేమ. అందుకొని అందించేది దయ. అందించి తృప్తిచెందేది ప్రేమ.

సత్యభామ కోరిందని పరమాత్మ సురలోకం వెళ్ళి పారిజాత పుష్పాన్ని తెచ్చి ఇస్తాడు. అది తెలిసి సురరాజైన ఇంద్రుడు శ్రీకృష్ణుని సమీపించి, "దేవా! భృత్యులము మేముండగా మీరే స్వయంగా వచ్చి పారిజాతాన్ని తీసుకొనివెళ్ళాలా! ఆజ్ఞాపిస్తే, మహాభాగ్యంగా భావించి మేమే వచ్చి ఉండేవాళ్ళం. సురపారిజాతాన్ని మీ పాదాలవద్ద సమర్పించి ఉండేవాళ్ళం" అంటాడు.

"ఇంద్రా! అది నాపై మీకున్న ప్రేమ. సత్యభామపై నాకున్న ప్రేమ నాచేత ఆపని చేయించింది. చెబితే మీరు చేయరని కాదు. తెలిస్తే చేస్తారనే నేను తొందర పడ్డాను. ప్రేమ తానే చేస్తుంది. చేయించుకోదు" అంటాడు ప్రేమావతారమూర్తి. ఇది పరమాత్మ ప్రేమ హృదయం. పరమాత్మను తల్లిగా స్వంతం చేసుకోవాలంటే ముందుగా మనము బిడ్డలుగా అర్హతను పొందాలి. అర్హతను పొందితే చాలు; బిడ్డలు తల్లికడనే ఉన్నట్లు మనం పరమాత్మ చెంతనే ఉంటాము.

కోతి ఈ చెట్టు మీద నుండి ఆ చెట్టు మీదకి, ఈ కొమ్మ పైనుండి ఆ కొమ్మ మీదికి దుముకుతూ ఉంటుంది. కాని, ఒంటరిగా కాదు. కోతిపిల్లను పొట్టకు కరిపించుకొనే. వీపుపై ఎక్కించుకొని దూకి ఉండవచ్చు గదా! కడుపుకే ఎందుకు కరిపించుకోవాలి? అది కడుపుతీపి. ఈ ప్రేమలకన్నా కోటిరెట్లు పరమాత్మకు తన సంతానంపై ప్రేమ ఉంటుంది.

భగవంతుని ప్రేమవర్షం మనల్ని ముంచెత్తనపుడు మనం భక్తి చేసి ఏమి ప్రయో జనం? ఆలయాలు తిరిగి అందుకొనే దేముంటుంది? తిరిపెమెత్తే బుద్ధి తీర్థ క్షేత్రాల్లో కూడా అదే చేస్తుంది కాని తపస్సు చేయదు. పరమాత్మ ప్రేమ కిరణాలు మనపై పడేలా మన జీవన విధానాన్ని సరిచేసుకోవాలి. అహంకారాన్ని త్యజించి, బిడ్డ తల్లిపై ఆధారపడినట్లు పరమాత్మ నాశ్రయించుకొని జీవించాలి. అప్పుడే పరమాత్మ కృప మనపై వర్షిస్తుంది. అది జరగనపుడు ఆరాధనకు అర్థం లేదు. పరమార్థం ఉండదు.

**నా నొలియదిద్దరె నా నొలిదు ఫలవేను?**

"దేవా! నీవు ప్రేమించనపుడు నేను ప్రేమించి ఫలమేమి?" అని విఠలుని ఒక కీర్తనలో ప్రశ్నించాడు భక్త శిఖామణి సంత్ పురందరదాసు.

పూజ్యులు, ఆచార్యుల వారికి

**శ్రీ ఎస్.వాసుదేవరావు, ఐ.పి.ఎస్.,**

నమస్కారములు.

నా జీవితానికి మీరే గొప్ప ప్రేరణ. పరమేశ్వరుని జ్ఞానము మీ ద్వారా స్పష్టంగా, సమగ్రంగా మానవాళికి అందుతూ ఉంది. దానికి మేమందరము ఎల్లవేళలా మీకు కృతజ్ఞులము.

శ్రీవారి ఆధ్యాత్మిక సంపద మాకందరికీ అనేకములైన గ్రంథములు, ఆడియోలు, వీడియోలు, 'గిరిధారి' మాసపత్రిక - రకరకాలుగా అందింపబడుతూ ఉంటాయి. ఇది ఒక 'నాగరికత' స్థాయిని మించిన వారసత్వం. మహాభారతము విడుదల అయిన తరువాత మాకు మీ ద్వారా భాగవత, రామాయణ, మహాభారతము అనే రత్నత్రయము లభించడము జరిగింది. చైతన్య భగవద్గీత మా జీవితాలను మలుపు తిప్పిన, జీవితాంతం పఠించదగిన అద్భుత గ్రంథం.

ఆధ్యాత్మిక శిఖరాలలో హిమాలయాలను మించిన వారిలో ప్రముఖులైన మీ బోధలను వెనువెంటనే అందుకొనే భాగ్యం కలిగిన కోట్ల మంది జిజ్ఞాసువులలో నేను ఒకణ్ణి అయినందుకు ఆనందిస్తూ, మీకు శతకోటి నమస్కారాలు వినమ్రంగా సమర్పించు కుంటున్నాను.

**భవదీయుడు**

**వాసుదేవరావు**

---

**శ్రీమతి సుశీల**

**శాన్‌డీగో, అమెరికా**

పూజ్యశ్రీ సుందర చైతన్యానంద స్వామి వారలకు సుశీల సాష్టాంగ నమస్కార స్పందనతో వ్రాయునది.

స్వామిజీ!

తమరు అందిస్తున్న ఏ గ్రంథము చదివినా, ఏ క్యాసెట్ విన్నా, ఏ వీడియో సి.డి. చూచినా దేని కదే విశిష్టంగా ఉంది. తియ్యని అనుభూతితో హృదయం ద్రవించిపోతూ ఉంటుంది.

హింసాత్మకంగా తయారవుతున్న ప్రపంచములో **'అహింసా పరమోధర్మః'** అనే విషయాన్ని సుస్పష్టం చేస్తూ, మన సంస్కృతిలో ఉన్నదంతా అహింసే నని, సృష్టిలో ఎక్కడ చూచినా యజ్ఞజీవనమే ఉంది అంటూ ప్రవచనాల్లో వివరించటమే గాక, వ్రాతల్లో పొందు పరుస్తూ, తియ్యని గానం ద్వారా అనుభవాలకు ఆధారంగా ఉన్న స్వరూపాన్ని వర్ణించటం ఓహ్! అత్యంత మహిమాన్వితం. పూజ్య స్వామిజీకి మరొక్కసారి హృదయపూర్వక వందనములు.

**కృతజ్ఞతాభి వందనములతో**

**సుశీల**

---



**ఎన్. ఉషా సుధీర్**

**గాంధీనగర్, చెన్నై**

వాక్చాతుర్యంలో బృహస్పతి లాంటివారు, దైవ సమానులు అయిన శ్రీ సుందర చైతన్యానంద స్వామిజీకి పాదాభివందనములు.

స్వామిజీ! మీ తల్లిగారు ధన్యురాలు. సుమిత్ర లాగా అదృష్టవంతురాలు. అందరూ పిల్లల్ని తమ కోసం, తమ కుటుంబం కోసం కంటారు. కాని, మీ మాతృమూర్తి రామాయణంలో సుమిత్ర లాగా మిమ్మల్ని రామసేవకు కనింది. ఆమె జీవితం ధన్యమైంది. దయచేసి మీ తల్లిదండ్రుల ఫోటోలను నాకు పంపగలరని ప్రార్థన.

ఎన్ని జన్మలలో మీ అమ్మగారు ఎంత కఠోర తపస్సు చేశారో! ఆమె తపఃఫలంగా మీరు బిడ్డగా కలిగారు. మీరు అసమాన ప్రతిభావంతులు. ఊహలకు అందేవారు కారు. మీ బోధల ద్వారా అందరి హృదయాలలో బలమైన పీఠాన్ని అధిష్ఠించి ఉన్నారు.

మీరు రచించిన భారత, రామాయణాలు చదివి నేనెంతో పరవశించి పోయాను. చదువుతూ ఉంటే కళ్ళ ముందు సీతారాములు, శ్రీకృష్ణుడు, భీష్ములవారు కదులుతూ ఉన్నట్లే ఉంటుంది. దీనికి కారణం మీరే. మీ గ్రంథాలను నేను చదివి, అందులోని విషయాలను రాసుకొని, మా అమ్మకు చెబుతూ ఉంటాను. ఆమె ఎంతో ఆనందిస్తూ, మీ మాటల ముత్యాలను ఏరుకొని, తనలో తాను ముత్యాలహారాలు గుచ్చుకుంటూ ఉంటుంది.

స్వామిజీ! మనస్సు లోని ఈ నాలుగు మాటలతో మీకు సేవ చేసుకున్న అదృష్టవంతురాలను.

**భగవత్సేవలో**

**ఉష**

---

శ్రీ స్వామిజీకి

హార్దిక కృతజ్ఞతలతో శత నమస్సుమాలు.

నెల్లూరులో మీరు నిర్వహించిన జ్ఞానయజ్ఞాలు మా అదృష్టంగా భావిస్తుంటాము. తమ వాగ్ధాటి ఒక గంగా ప్రవాహం. తమ దివ్య బోధలు, అమృతవాక్కులు చిరస్మరణీయాలు. పామరులకు సైతం చక్కగా అర్థమయ్యేలా చిన్ని చిన్ని పదాలతో, మధుర గానంతో, కంచు కంఠంతో అందరినీ మైమరపిస్తారు. ఆనంద పరవశులై సింహపురి భక్తులు తరించారు. అలుపెరుగని మీ ఉపన్యాసాలు అపూర్వం. అమోఘం. అద్భుతం. తమ ప్రతిభ, విజ్ఞత, ఓర్పు, నేర్పు అందరికీ ఆదర్శం.

చిరునగవుతో మీరు ఇచ్చే చిట్కాలు, సీరియస్‌గా బోధించే నియమాలు భక్తుల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. అవి మరపురాని అనుభూతులుగా మాకు మిగిలిపోయాయి.

**తమ విధేయులు**

**యన్. దశరథరామిరెడ్డి**


**కె.జయరామిరెడ్డి**

# మంత్ర మహిమ

**స్వామి సుందర చైతన్యానంద**

**ఓం నమో భగవతే వాసుదేవాయ.**

మహాభక్తుడైన ధృవ కుమారునికి ధృవస్థానమును ప్రసాదించిన మహామంత్రమిది. నారద మహర్షి అనుభవంలో దేదీప్యమానంగా ప్రకాశించిన మంత్రమిది. ముఖ్యంగా నా జీవితంలో ప్రగతికి, సేవకు, సంతృప్తికి కేంద్రశక్తి ఈ మంత్రము.



ఎందరికో స్ఫూర్తిని, దీప్తిని, శక్తిని ప్రసాదించిన ఈ మంత్రము అందరినీ అలాగే అనుగ్రహిస్తుందని విశ్వసించి బహుళ ప్రచారము గావించడం జరిగింది. అందరూ నామం చేస్తున్నారు. మంత్రాన్ని మననం చేస్తున్నారు. బాగుంది. ఈ మంత్ర జపంవల్ల ఆధ్యాత్మికంగా అభివృద్ధి గోచరిస్తున్నదా? ఆశించినంతగా ప్రగతి సాధింపబడుతున్నదా? ఈ ప్రశ్నలకు "అవును" అనే సమాధానం చాలా తక్కువమంది నుండి మాత్రమే లభిస్తుందని నాకు తెలుసు. తెలిసిన ఈ విషయాన్ని ప్రకటించేందుకు ఈ విషయాన్ని ప్రత్యేకంగా వ్రాయడం లేదు. ప్రగతి లేకపోవడానికి కారణాన్ని అన్వేషించేందుకే వ్రాస్తున్నాను.

ప్రగతి ఊహించినంతగా లేదనే అంగీకరిస్తాం. అయితే, ఈ విషయంలో ఎవర్ని తప్పు పట్టాలి? మంత్ర శక్తిని శంకిస్తామా? అదే నిజమైతే, ఇదే మంత్రము ఎన్నో జీవితాలకు మార్గగామి అయిందే? ఎందరో బ్రతుకుల్ని పరవశింప చేస్తున్నదే?

మంత్రము..... **"మననాత్ త్రాయతే ఇతి మంత్రః"** మననం చేసే వ్యక్తిని రక్షించేది మంత్రము. అయితే, మన వైఫల్యానికి మంత్రము కారణం కాదు. మనమే కారణము. మన మనసే కారణము.

1) మంత్రాన్ని మనం ఎంత కాలం చేస్తున్నాం?

2) ఎలా చేస్తున్నాం?

ఈ పై రెండు విషయాలపై మన ప్రగతి ఆధారపడి ఉంటుంది.

మంత్రము ద్వారా మాధవ చైతన్యంలో ఓలలాడాలని అభిలషించే మనము ప్రతి దినము విషయ ప్రపంచానికి కేటాయిస్తున్న కాలంలో పదవ వంతైనా మంత్ర జపానికి కేటాయిస్తున్నామా? వాస్తవం చెప్పాలంటే, విషయ ప్రపంచానికి కేటాయించే కాలంకన్నా ఎక్కువ సమయాన్ని మంత్ర జపానికి వినియోగించాలి. ఇంత సమయం మాకు ఎక్కడ



లభిస్తుంది? అని మీరు ప్రశ్నిస్తారని నాకు తెలుసు. కర్మల మధ్య నామం ఎలా సాగిపోతూ ఉండాలో అనేక కోణాల్లో నుండి నేను మీకు తెలిపాను. గ్రంథాల్లో వ్రాశాను. సమయం అవరోధం కాదని మీకు తెలుసు. మనసులో సానుకూలం, శ్రద్ధ లేకపోవడమే అవరోధము. కనుక మంత్ర వైశిష్ట్యాన్ని దృష్టిలో ఉంచుకొని మంత్రజపము యొక్క కాలాన్ని బాగా పెంచాలి.

ఎలా చేస్తున్నాము? అనేది ఇక రెండవ విషయం. భక్తి ప్రేమలతో చేస్తున్నామా? యాంత్రికంగా చేస్తున్నామా? రెండవదే కనుక నిజమైతే మన ప్రగతి ఊహకందని విషయం. టేపు రికార్డర్‌కి, క్యాసెట్‌కి మోక్షం వస్తేనే మనకు కూడా వచ్చేది.

భక్తి ప్రేమలతో చేసినపుడే మంత్రము మహిమను వ్యక్తం చేస్తుంది. ప్రాపంచిక విషయాల మీద, వస్తువుల మీద, వ్యక్తుల మీద మనకున్న ప్రేమకన్నా మంత్రము మీద ఎక్కువ ప్రేమ ఉందో లేదో ముఖ్యంగా ఎవరికి వారు బేరీజు వేసుకోవాలి. అశాశ్వతమైన విషయ ప్రపంచాన్ని అధికంగా ప్రేమించేవారు నామాన్ని లేదా మంత్రాన్ని అధికంగా ప్రేమించలేరు. ఈ ప్రపంచంలో మనం అత్యుత్తమ సుఖాలని భావించేవాటిని అనుభవించే ముందు ఎంతటి ఆసక్తి ఉంటుందో, అంతకన్నా ఎక్కువ ఆసక్తితో, ప్రేమతో మంత్ర జపం చేసినపుడే మంత్ర వైభవము మనిషిలోకి దిగుతుంది.

మంత్రము - మంత్ర అధిష్ఠాన దేవత వేరు వేరు కారు. మంత్రము - మహిమ ఎప్పుడూ వేరు కావు. మహిమను మనిషిలో ఉంచేదే మంత్రము. దించేదే మంత్రము.

**బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వ మరోగతా**
**అజాడ్యం వాక్పటుత్వం చ హనుమ త్స్మరణా ద్భవేత్ ॥**

హనుమంతుని స్మరించగనే బుద్ధిబలం, దేహబలం, కీర్తి, ధైర్యము, నిర్భయ త్వము, ఆరోగ్యము, చురుకుదనం, వాక్పటిమ లభిస్తాయి అంటారు.

నిజమే. మంత్రమూర్తి వైభవమే మంత్రంలో నిగూఢంగా ఉంటుంది. రామ భక్తులు ధర్మమూర్తులై శోభిస్తూ ఉంటారు. శివభక్తులు ధ్యానరూపులై ఉంటారు.

మరి, కృష్ణభక్తులు? వారు "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే మంత్రాన్ని నమ్ముకున్నవారు. జ్ఞానమూర్తులై ఉంటారు. ప్రేమరూపులై ఉంటారు. ఈ జ్ఞాన, ప్రేమల్ని పొందాలని అభిలషించేవారు "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే ఈ మహామంత్రాన్ని 1. ఎక్కువ కాలం దీక్షగా జపించాలి 2. భక్తి ప్రేమలతో చేయాలి. అప్పుడే మంత్ర వైభవాన్ని జీవితంలో దర్శించగలం.

నామ యోగులు, మంత్రయోగులు మరొక విషయాన్ని కూడా ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాలి. ఏకాంతంలో మంత్రోచ్చారణ చేసినంత వరకు ఏ ఇబ్బంది ఉండదు.

ప్రపంచంలో చరించేటప్పుడు ప్రారంభ సాధకులకు అవరోధాలు మెండుగా ఉంటాయి.

అనవసరమైన ప్రసంగాలను సాధకులు మానేయాలి. ఒకవేళ అన్యులు ప్రస్తావించినా ఉదాసీన వైఖరిని అవలంబించడం అలవరచుకోవాలి. మంత్రం ఆంతర్యంలో నిశ్శబ్దంగా నడుస్తూ ఉంది కనుక ఎవరిని చూసినా, వారి వ్యక్తిత్వమును గాకుండా వారిలోని వాసుదేవ చైతన్యాన్ని దర్శించడం నేర్చుకోవాలి. ఆ దర్శనం వెనుక ప్రేమ తొణికిస లాడుతూ ఉండాలి. ఈ ప్రపంచమంతా వాసుదేవుని వైభవమే అని భావించి నామామృతం నిండిన హృదయంతో వీక్షించడం ప్రారంభిస్తే "సర్వం వాసుదేవ మయం"గా గోచరిస్తుంది.

ఈ దశలో నీకు ఎవరు తటస్థపడినా నిజానికి వారు తటస్థ లక్షణానికి చెందిన వారే. స్వరూప లక్షణంగా వాసుదేవుడే నీకు వారిలో ప్రత్యక్ష మవుతాడు. నీలో ప్రశాంతత నిండుకుంటుంది. ప్రశాంత చిత్తముతో నీవు ఆచరించే కర్మలు నైవేద్యాలుగా నివేదింప బడుతాయి. ఫలితాలు ప్రసాదాలవుతాయి. పరమాత్మకన్నా అన్యంగా భాషించవలసిన విషయం నీకు మిగలదు. లౌకిక విషయాలలో నీవు మగ్నమైనా, మధ్యలో పరమాత్మ ముచ్చట్లు చోటు చేసుకొంటూ ఉంటాయి. ఈ విధంగా నామ సాధన, మంత్ర సాధన బ్రతుకును భవ్యంగా, భగవన్మయంగా మార్చుతుంది.

మంత్రాన్ని భక్తి ప్రేమలతో మననం చేయండి. మనసు పెట్టి మరీ చేయండి. మనసు లేకుండా పలికితే మంత్రం సిద్ధించదు. మనసును మాధవునిపై పెట్టి మంత్రాన్ని కొనసాగిస్తే, మనసు మాధవ చైతన్యంలో ఓలలాడుతుంది. పరమాత్మ శాంతస్వరూపుడు. మనసు మాధవునితో ఐక్యం కాగానే మనం కూడా శాంతిని అనుభవిస్తాము.

**సజ్జనః శాంతి మాప్నుయాత్.** సజ్జనులు శాంతిని పొందెదరుగాక!





# హుష్......కాకి

**స్వామి సుందర చైతన్యానంద**

ఆశించినా సుఖం లభించదు. నిరాకరించినా దుఃఖం దూరం కాదు. సత్యము నిత్యమైనందున పరిణామము నెరుగదు. మార్పు తెలియని స్వరూ పంలో దుఃఖము అనూహ్యము.

అసత్యము అనిత్యమైనందున అది మనుగడ నెరుగదు. అలాంటిది నీకు దుఃఖాన్ని పంచలేదు. మరి దుఃఖ మెలా ప్రాప్తించింది? సత్యాసత్య వివేకము లోపించడము వలననే దుఃఖం సంభవమైంది. ఇదియే అజ్ఞానము.



**అజ్ఞానే నావృతం జ్ఞానం తేన**
**ముహ్యన్తి జన్తవః ॥**

"జ్ఞానము అజ్ఞానముచే కప్పబడి యున్నందున జీవులు మోహానికి గురియగు చున్నారు" అని గీతాచార్యుని ప్రబోధము.

స్వరూపానుభూతికి అజ్ఞానమే ప్రతిబంధకము. అజ్ఞానము సృష్టించే దుఃఖము నుండి విడిపడాలంటే జ్ఞానము కావాలి. జ్ఞానము వలన అజ్ఞానము తొలగించబడుతుంది. స్వరూపము స్వతఃసిద్ధమై భాసిస్తూ ఉంటుంది.

ఇక్కడ కావలసింది అజ్ఞానమును తొలగించే ప్రమాణమే గాని ఆత్మను ప్రకాశింప చేసే ప్రయత్నము కాదు.

ప్రమాణము ద్వారా జ్ఞానము సిద్ధిస్తుంది. ఈ జ్ఞానము అపరోక్షమే గాని పరోక్షము కాదు. పారిజాతాలు నా ముందే ఉన్నాయి. కాని, అవి పారిజాతాలు అని నాకు తెలియదు. ఇక్కడ నాకు జ్ఞానం కావాలి. "ఇవి పారిజాతాలు" అనే జ్ఞానం కావాలి. అయితే, ఈ జ్ఞానం మాత్రం ప్రత్యక్షమే గాని పరోక్షము కాదు. పారిజాతాలకు సంబంధించిన అజ్ఞానము "ఇవి పారిజాతాలు" అని తెలియడం వల్ల తొలగిపోతోంది.

అలాగే ఆత్మ ఎప్పుడూ ఉంది. అది సాధ్యవస్తువు కాదు. సిద్ధవస్తువు. నాకు కావలసింది ఆత్మ కాదు. అజ్ఞానమును నివృత్తి చేసే జ్ఞానవృత్తి. జ్ఞానవృత్తి అజ్ఞానవృత్తిని తొలగించి తానూ అంతర్హిత మవుతుంది. ఇది ప్రమాణము యొక్క ప్రభావము. బోధయొక్క వైభవము.

రెండవ దానిని ఆత్మ అంగీకరించదు. కనుకనే ఆత్మ అద్వయమైంది. ఇది స్వరూపమే గాని దర్శనము కాదు. ఆత్మను దర్శించే వారెవరు? అలా ఎవరైనా ఉండినట్లు, లేదా ఉన్నట్లు మనం నిర్ణయిస్తే మాత్రం అతని చేత తెలియబడేది లేదా దర్శింపబడేది ఆత్మ కాదని నిర్ణయించవలసి వస్తుంది. రెండు లేని ఆత్మలో ద్వైతాన్ని చొప్పించలేము.

మరి, ఈ సృష్టి ఏమిటి? రెండవ దానికి మనుగడ లేని సత్యస్వరూపంలో సృష్టిని ఊహించను సాధ్యపడదు. దీనిని మిథ్యగా గ్రహించుటే సత్యము.

జగత్తు మిథ్యయే. కాని ఇది కూడా సత్యమే నేమో! పరమాత్మకన్నా వేరుగా మిథ్య ఉందని అంగీకరిస్తే పరమాత్మ పరిమితుడుగా, పరిణామిగా మిగిలిపోతాడు. కనుక,

**మిథ్య కూడా సత్యమే**

**కాని, సత్యం మిథ్య కాదు.**

సర్పము రజ్జువే గాని రజ్జువు మాత్రం సర్పం కాదు. కాలేదు. ఇది అపరోక్ష జ్ఞానము.

రజ్జువుకు సర్పముతో సంబంధము లేకపోయినను అజ్ఞానదశలో మోహింపబడిన జీవులకు సంబంధము ఉన్నట్లే తెలుస్తూ ఉంది. దీనినే "అధ్యస్త" సంబంధ మంటారు. ఇది తటస్థము. కనుక సృష్టి వివరణము తటస్థ లక్షణము ద్వారానే వివరించబడుతుంది. దీనికి చక్కని సోదాహరణమే **శాఖాచంద్ర న్యాయము.**

ఒక ఇంటి మీద కాకి కూర్చొని ఉంది. ఇల్లు తెలియుటకు కాకి సహకరించ వచ్చు. కాని, కాకి ఇంటిలో భాగము కాదు. కనుక, ఇంటిని గ్రహించగనే కాకి అవసరం తీరిపోతుంది. కాకికి ఇంటితో ఏవిధమైన సంబంధము లేకపోయినా ఉన్నట్లు తెలుస్తూ ఉంది. ఇది అధ్యస్త సంబంధము.

సృష్టిని గూర్చి ఎప్పుడు, ఎక్కడ శాస్త్రములో ప్రవచించినా **యతోవా ఇమాని భూతాని జాయన్తే.** . . . 'ఈ సమస్త భూతజాలము ఎక్కడి నుండి కదలివచ్చిందో, ఎక్కడ కదులుతున్నదో, ఎక్కడ కనుమరు గవుతున్నదో' అంటూ ప్రారంభించడం జరుగుతుంది. ఇది తటస్థ లక్షణము. **'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ'** అనేది స్వరూప లక్షణము.

**తాటస్థ్యా దాస్పదం స్వం గమయతి పరమం బ్రహ్మ శాఖేవ చంద్రమ్.** తటస్థ సంబంధముచే (తాటస్థ్యాత్) తన అధిష్ఠానమగు (స్వం ఆస్పదం) పరబ్రహ్మమును (పరమం బ్రహ్మ) కొమ్మ (శాఖ) చంద్రుని వలె(చంద్రమివ) సూచిస్తున్నది (గమయతి).

ఆకాశంలో చంద్రవంక కనిపించ నపుడు దానిని దర్శించినవాడు వృక్షశాఖను ఆధారంగా చేసుకొని సూచించడం జరుగుతుంది. చంద్రుని దర్శించుటకు చెట్టుకొమ్మ ఉపకరించినా, సహకరించినా వాస్తవానికి కొమ్మకు చంద్రునితో సంబంధము లేదు. ఒకవేళ ఉన్నట్లు అంగీకరిస్తే అది తటస్థ సంబంధము లేదా అధ్యస్త సంబంధ మవుతుంది. చంద్రుని దర్శించిన తరువాత, ఇంటిపై నున్న కాకి వలె, వృక్షశాఖ కూడా నిరుపయోగమే అవుతుంది.

*(37వ పేజీ చూడుము)*



# కేనోపనిషత్తు క్విజ్ పోటీ

**పూర్ణిమ**

ఇరవై సంవత్సరాల క్రితం సామవేదాంతర్గత మైన కేనోపనిషత్తుపై పూజ్య గురుదేవులు చేసిన ప్రవచనాల ఆధారంగా శ్రుతిమందిరంలో పూజ్య స్వామీజీ దివ్య సన్నిధానంలో క్విజ్ కార్యక్రమం అత్యద్భుతంగా నిర్వహింపబడింది.

ఆ క్విజ్‌లో పాల్గొన్న నాలుగు గ్రూపుల వారికి పవిత్ర, మిత్ర, సుమిత్ర, జగన్మిత్ర అని నామకరణం చేయడం మొదలు పూజ్య గురుదేవులు ప్రత్యేక శ్రద్ధ వహించడంతో కార్యక్రమం ఎంతో అందంగా, ఆసక్తికరంగా హాజరైన అశేష భక్త జనులే కాకుండా ముఖ్యంగా పూజ్య గురుదేవులు అమితంగా ఆనందించారు. విషయం ఎంతో జటిలమైన ఉపనిషత్తైనా పాల్గొన్న వారందరూ ప్రశ్నలకు నూరు శాతం సరైన సమాధానాలు నిర్ణీత సమయానికి ముందుగానే చెప్పడం పూజ్య గురుదేవులను ఎంతగానో ఆకట్టుకుంది. తల్లిదండ్రులకు పుత్రోత్సాహం ఎలా ఉంటుందో అంతకు మించిన శిష్యోత్సాహం శ్రీ స్వామీజీ ఫలితాలు వెల్లడించడంలో గోచరించింది. క్విజ్ అనంతరం పాల్గొన్న నాలుగు గ్రూపులలోని వారికి ఆశ్రమం తరపున శ్రవణ మంగళమైన క్యాసెట్లను బహూకరిస్తూ గురుదేవులు అందర్నీ ఆశీర్వదించారు.

'గిరిధారి' పాఠకుల ఉపయోగార్థం క్విజ్ పోటీలో అడిగిన ప్రశ్నలను, అందించిన సమాధానాలను జతచేసి ఇందు ప్రచురిస్తున్నాము.

## మొదటి రౌండు

1. ఉపనిషత్ శబ్దంలో అసలైన పదం ఏది? అది ఏ ధాతువు? దాని అర్థాన్ని సంస్కృతంలో చెప్పండి?

**ఉపనిషత్ శబ్దంలో 'సద్' అనేది పదము. ధాతువు - షదల్. అర్థం - విశరణ గత్యవసాదనేషు.**

2. విశరణ - గతి - అవసాదన. ఇవి ఏమిటో సంస్కృతంలో వివరించండి.

**విశరణ - శిథిలీకరోతి**

**గతి - బ్రహ్మ గమయతి**

**అవసాదన - కారణేన సహ అవసాదయతి.**

3. మనువు సుఖదుఃఖాలను ఎలా నిర్వచించాడు? సంస్కృతంలో చెప్పండి.

**సర్వం పరవశం దుఃఖం**

**సర్వం ఆత్మవశం సుఖం.**

4. అధ్యాసను బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీ శంకరాచార్యులు ఎలా నిర్వచించారు? దాని అర్థము ఏమిటి?

**అధ్యాసో నామ అతస్మిన్ తత్ బుద్ధిః.**

**అది గాని దాని యందు, అది అనెడి భావన అధ్యాస.**

5. ఋషులు జ్ఞానాన్ని సృష్టించారు. అవునా? లేకపోతే ఏమి సృష్టించారు? సంస్కృతంలో చెప్పండి.

**ఋషిభిః న ప్రమాణ కర్తారః. ఋషిభిః సంప్రదాయ కర్తారః.**

6. కేనోపనిషత్ ఏ వేదం? ఏ శాఖ? ఏ అధ్యాయం?

**కేనోపనిషత్ సామవేదం........ తలవకార శాఖ........ తొమ్మిదవ అధ్యాయం.**

7. సర్వం అనే పదానికి అర్థ మేమిటి?

**విదితం అవిదితం సర్వం బ్రహ్మోపనిషదం ఇదం సర్వం ఇత్యర్థః.**

8. మిథ్య అంటే ఏమిటి? సత్య మిథ్యల సంబంధ మేమిటి? ఉదాహరణ ఇవ్వండి.

**మరొక దాని మీద ఆధారపడి ఉండేది మిథ్య.**

**మిథ్య కూడా సత్యమే, కాని సత్యం మిథ్య కాదు.**

**కుండ మట్టే కాని మట్టి కుండ కాదు.**

9. శాంతి మంత్రాలలో ప్రధానంగా మూడు విషయాలు ప్రతిపాదించబడతాయి. ఏమిటవి?

**(1) తత్త్వ ప్రతిపాదన (2) ప్రార్థన (3) సమర్పణ.**

10. సామవేదంలో ఏ శాంతిమంత్రం ఉంది?

**ఆప్యాయన్తు మమాంగాని.**

11. శిష్యుడికి బాగా అర్థమయినదా లేదా అని తెలియటానికి గురువు శిష్యుని చలింపచేస్తాడు. దానిని ఏ న్యాయం అంటారు? దాని అర్థ మేమిటి?

**స్థూన ఖనన న్యాయము. నాటిన గుంజను కదిపి చూడటం స్థూన ఖనన న్యాయం.**

12. దేవ శబ్దానికి అర్థ మేమిటి?

**ద్యోతనాత్మకః.**

## రెండవ రౌండు

1. నీకు బ్రహ్మము తెలిసింది అని భావించావంటే, అది స్వల్పమే అంటాడు గురువు. ఎందుకని?

**నీవు ప్రత్యేకంగా ఉండి అఖండ పరబ్రహ్మన్ని తెలుసుకునే అవకాశం లేదు కనుక.**

2. ఎవనికి తెలియదో వానికి తెలుస్తుంది. ఎవనికి తెలుసో వానికి తెలియదు. జ్ఞానులైన వారికి అది తెలియదు. అజ్ఞానులకు అది తెలుస్తుంది. ఈ భావనకు సంబంధించిన మంత్రమును చెప్పేది.

**యస్యా మతం తస్య మతం మతం యస్య న వేదసః**

**అవిజ్ఞాతం విజానతాం విజ్ఞాతం అవిజానతాం.**



3. బ్రహ్మను గురించి ఏ జవాబు చెప్పిన శిష్యునికి నిజమైన జ్ఞానము ఉంది?

**నాకు బాగా తెలిసింది అని అనుకోవటం లేదు. అంటే తెలియదని కాదు. తెలుసు కూడా.**

4. ఇంద్రియాలు ప్రత్యేక మైనపుడు సామాన్య మేది? ఎలా చెప్పగలవు?

**ఇంద్రియాలు ప్రత్యేక మైనపుడు సామాన్యము మనస్సు. ఒక్కొక్క ఇంద్రియము ప్రత్యేకముగా తాను చేయగలిగిన పని మాత్రమే చేస్తూ ఉన్నప్పటికి ప్రతి ఇంద్రియము వెనుక ఒకే మనస్సు సామాన్యంగా ఉండి ఆయా ఇంద్రియాల విషయాలను తెలుసుకుంటుంది. ఉదాహరణకు, మల్లె పువ్వు సువాసనను మాత్రమే ముక్కు తెలుసుకొంటుంది. రంగును నేత్రమే తెలుసుకుంటుంది. వాక్కు 'ఇది మల్లె పువ్వు' అని చెబుతుంది. కాని, మనస్సు అన్నిటినీ తెలుసుకొంటూ సామాన్యంగా ఉంది.**

5. ఏది వాక్కు ద్వారా వ్యక్తపరచ బడదో, దేని వలన వాక్కు వ్యక్తమగునో అదియే బ్రహ్మము అని గ్రహింపుము. అంతియే గాని ఇక్కడ జీవులు ఉపాసించునది మాత్రము కాదు. ఈ భావనకు సంబంధించిన మంత్రమును చెప్పేది.

**యత్ వాచా అనభ్యుదితం యేన వాగభ్యుద్యతే**

**తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిద ముపాసతే ॥**

6. నీలో పరమాత్మ స్వరూపం ఎలా ప్రసిద్ధం? భాష్య వాక్యంలో చెప్పండి.

**శ్రోత్రస్య శ్రోత్ర రూపేణ ప్రత్యగాత్మ రూపేణ ప్రసిద్ధః బ్రహ్మం.**

7. సాధనలలో ఉత్తమ సాధన నుండి అధమాధమ సాధన వరకు శ్లోక రూపంలో చెప్పండి.

**ఉత్తమా ప్రథమావస్థా**

**మధ్యమా ధ్యాన ధారణా**

**అధమా ప్రతిమా పూజా**

**తీర్థయాత్రా అధమాధమా.**

8. నాకు అది బాగా తెలిసినది అనుకోవడం లేదు. అలాగని తెలియదనుకోవడం లేదు. మా ఇరువురిలో ఎవడు అది తెలిసినది అనియు, తెలియనిది అనియు తెలుసుకొనునో అతడికి బాగా తెలియును. ఈ భావనకు సంబంధించిన మంత్రమును చెప్పేది.

**నాహం మన్యే సువేదేతి నో న వేదేతి వేదచ**

**యో న స్తద్వేద తద్వేద నో న వేదేతి వేదచ ॥**

9. లక్షణానికి నిర్వచనం ఏమిటి? సంస్కృతంలో చెప్పండి.

**సర్వేభ్యః అన్యేభ్యః విషయేభ్యః వ్యావర్తకం లక్షణం.**

10. అనంతం అంటే ఏమిటి? అనంతమును నిర్వచింపుము.

**దేశతః కాలతః వస్తుతః అపరిచ్ఛిన్నః.**

11. ఉపనిషత్తును అధ్యయనం చేసేవాడు ఎవర్ని సమీపిస్తాడు? ఎలా సమీపిస్తాడు? ఏ విషయాన్ని అడుగుతాడు? ఎందు కడుగుతాడు? అది ఎలాంటిది? దీనికి శంకర భాష్యం ఏం చెబుతుందో సంస్కృతంలో చెప్పండి.

**కశ్చిత్ గురుం బ్రహ్మనిష్ఠం విధివత్ ఉపేత్య, ప్రత్యగాత్మ విషయాత్ అన్యత్ర శరణం అపశ్య, అభయం నిత్యం శివం అచలం ఇచ్ఛన్ పప్రచ్ఛ.**

12. ఏ విధమైన విశేషణాలు లేని చైతన్య జ్యోతి ఎలా ప్రాప్తవ్యం? శంకరుల భాష్య వాక్యంలో చెప్పేది.

**బ్రహ్మత్వ ప్రతిపాదకస్య వాక్యస్య ఆచార్యోపదేశ పరంపరయా ప్రాప్తత్వం.**

## మూడవ రౌండు

1. జ్ఞానస్య సాధనం కిమ్?

**శ్రవణం.**

2. లోకము అంటే ఏమిటి? సంస్కృతంలో చెప్పేది.

**లోక్యతే ఇతి లోకః అనుభూయతే ఇత్యర్థః.**

3. న తత్ర చక్షుర్గచ్ఛతి - అక్కడికి కళ్ళు చేరలేవు. ఎందుకని? సంస్కృతంలో చెప్పండి.

**స్వాత్మని గమనం అసంభవాత్.**

4. గాఢనిద్రలో ఉండే దృక్ పేరేమిటి? అక్కడ గ్రుడ్డి వాని స్థితి ఏమిటో సంస్కృతంలో చెప్పండి.

**అలుప్త దృక్. అంధః అనంధో భవతి.**

5. ప్రాణం జడం అని ఎలా చెప్పగలవు?

**నిద్రలో ప్రాణం చలిస్తుంది, కాని మనకు తెలియదు.**

6. అగ్ని, వాయువు ఆత్మని ఎందుకు తెలుసుకోలేకపోయారు?

**ప్రమాణం లేదు గనుక.**

7. ప్రమాత ఆత్మ జ్ఞానాన్ని ఎలా తెలుసుకోవాలి?

**ప్రమాతృత్వం లేకుండా తెలుసుకోవాలి.**

8. విదితం ఎందుకని హేయం? సంస్కృతంలో చెప్పండి.

**యద్విదితం తదల్పం**
**యదల్పం తత్ మర్త్యం**
**యత్ మర్త్యం తద్దుఃఖాత్మకం**
**యత్ దుఃఖాత్మకం తత్ హేయం.**



9. బ్రహ్మము కేనోపనిషత్తులో ఏ పదంతో పిలవబడింది? ఆ పదం కావ్యాల్లో వచ్చిందా? వచ్చి ఉంటే ఏ కావ్యంలో వచ్చింది? ఏ సన్నివేశంలో ఉంది?

**తద్వనం..... రామాయణంలో వచ్చింది. మతంగ వనంలో శబరి ఆశ్రమం సమీపంలో తద్వనం ఉంది.**

10. ఆత్మను శ్రోత్రస్య శ్రోత్రం అని ఋషి ఎందు కన్నాడు?

**ఎక్కడో ఉంటే, తన కన్నా వేరుగా దూరంగా ఉందని, దానిని పొందాలి అనుకుంటాడు గనుక.**

11. ఉపనిషత్తు శబ్దము ద్వారా ఏ విద్య కలుగుతుంది? దాని స్వరూపం ఎలాంటిది? సంస్కృతంలో నిర్వచించండి.

**యయా విద్యయా అక్షరం అధిగమ్యతే స బ్రహ్మ విద్య ఉపనిషత్ శబ్దేన ఉచ్యతే.**

12. మనసుకు ఆలోచనా శక్తి ఎలా కలుగుతుందని సూత్ర భాష్యంలో శ్రీ శంకరులు చెప్పారు? సంస్కృతంలో చెప్పండి.

**అంతఃస్థేన చైతన్య జ్యోతిషా అవభాసితస్య మనసః మనన సామర్థ్యం.**

ఓం . . . .

అనంతరం భక్తులందరికీ అన్న సంతర్పణము జరిగింది. సుమారు **1400** మంది ఈ కార్యక్రమంలో పాల్గొని ఆనందించారు.


---

***(32వ పేజీ తరువాయి)***

సృష్టి స్థితి లయాదులు బ్రహ్మలక్షణములు కాకపోయినా తటస్థ లక్షణము ద్వారా పరమాత్మను గ్రహించవచ్చు. ఈ లక్షణము స్వరూప జ్ఞానము కొరకే గాని సృష్టి వివరణమునకు మాత్రము కాదు. ఇదే శాఖాచంద్ర న్యాయము.

ఉపాధిభేదంతో మిథ్యాజ్ఞానము ఏర్పడింది. ఉపాధిని ఆత్మకన్నా వేరని భావిస్తే ఉపాధి సత్యమవుతుంది. ఇక్కడే అసత్యమైన జగత్తు సత్యంగా భాసిస్తోంది. ఇది "అహం భావన'.

ఈ అహంభావన తటస్థ లక్షణము ద్వారా తొలగింపబడితే 'అహం' స్వరూపంగా ప్రకాశిస్తుంది. ఉన్నది ఎప్పుడూ ఉంది (**యదస్తి తత్ సత్యం**). దానికి నామరూపాలతో ఏవిధమైన సంబంధం లేదు. అది కేవలం అస్తి (ఉన్నది). వస్త్రం చిరిగి ఉంది. చిరిగిన వస్త్రం ఉంది. 'ఉంది' అనేది దేనితోనూ సంబంధము లేకుండా ఏకమై భాసిస్తోంది. అదే స్వరూపము. తటస్థము ద్వారా తటస్థించే కూటస్థము.



# చైతన్య ప్రభంజనం

శ్రీ డి.వి.ఎన్.మల్లికార్జున శర్మ

## నిర్విఘ్నం కురుమే దేవ!

శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానంద సద్గురుదేవులు 27-8-2025 బుధవారం ఉదయం 11 గంటలకు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి పూజతో ఆరంభమైన శ్రీ గణేశ చతుర్థి వేడుకలను వాణీ చైతన్యం (గురుమందిరం)లో ఆహూతులైన భక్తజనులకు అనుగ్రహించి ఆశీర్వదించారు.

'మహాగణపతే నమోస్తుతే' భజనతో ఆరంభించి చైతన్య గానామృతాన్ని, ఇతర భజనలను పాడుతూ పాడించారు. అద్భుతమైన అలంకరణతో దేదీప్యమానంగా ప్రకాశించే వేదికపై ప్రతిష్ఠితమైన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి మృత్తికా మూర్తికి అభిముఖంగా ఆసీనులై పూజ్య గురుదేవులు గణేశునకు గానార్చన గావించారు.

అనంతరం బ్రహ్మచారి కృష్ణ ప్రసాద్ శాస్త్రోక్తంగా గణేశ పూజను నిర్వహించారు. పూజ్య గురుదేవుల దివ్య సన్నిధిలో గణనాథుని పూజను దర్శించుకోవడం ఆనాటి భక్తుల భాగ్యం!

ఎన్నిమార్లు చెప్పుకున్నా తనివి తీరని సత్యం, పూజ్య గురుదేవుల సాక్షాద్దర్శనంలో కలిగే భగవదనుభూతి! అది అనుభవైక వేద్యం! మన అనుభూతికి అనుగుణంగా పూజ్య గురుదేవుల దివ్య విభూతి దర్శన భాగ్యం!

పూజ తరువాత ఆనంద కర్పూర నీరాజన దర్శనానంతరం పూజ్య గురుదేవులు స్వయంగా ప్రతి ఒక్కరికీ తీర్థ వితరణ గావించారు. తీర్థము ఉంచబడిన పంచపాత్ర అతి చిన్నది. ఆ పాత్రకు తగిన ఉద్ధరిణి! పాత్రను మళ్ళీ నింపడం జరగలేదు. డెబ్బై మందికి పైగా భక్తులు హాజరు కాగా ప్రతి భక్తునికీ తీర్థం అందింది. చివరిలో ఇంకా కొంత మిగిలింది అని కూడా తెలిసింది. నిజానికి ఇది ఒక వింత! ఎందరు గమనించారో తెలియదు.

ప్రసన్న వదనంతో ప్రశాంత హాసంతో వాత్సల్య పూర్ణ దృక్కులను ప్రసరింప జేయుచూ పూజ్య గురుదేవులు అందరికీ ప్రసాదంగా ప్రథమ వందనుని దివ్య తీర్థాన్ని భవ్య భావనోద్దీపనంగా అనుగ్రహించారు. తరువాత అన్నపూర్ణా క్షేత్రంలో మహాప్రసాద వితరణ పూజ్య గురుదేవుల అనుగ్రహంతో విజయవంతంగా సమాప్త మయింది.



గురుమందిరంలో కొలువైన గణనాథుడు నిత్య పూజాదికములను అందుకుంటూ నవరాత్రులు భక్తజనులకు కనువిందు చేశాడు.

**4-9-2025** గురువారం గణేశ నిమజ్జనోత్సవం శ్రుతి మందిరలో అత్యంత వైభవోపేతంగా జరిగింది.

చైతన్య స్వాధ్యాయ మాతృమూర్తులు గురుమందిరం మొదలుగా శ్రుతిమందిరం వరకు దివ్య వర్ణ పుష్పాలంకరణ గావించారు. ఒక పెద్ద వాహనాన్ని దివ్య రథంగా పుష్ప విశేషాలతో అలంకరించి, దానిపై గణేశ్ మహరాజ్‌ను, గురు మహరాజ్‌ను ఊరేగింపుగా శ్రుతిమందిరం వేదిక వరకు భక్తులు అనుసరించారు. ఆ రథంపై గణేశ ఉత్సవ మహిళా కార్యకర్తలు, ఒకే రకమైన సంప్రదాయ వస్త్ర ధారణతో శ్రీ గురుచరణుల దివ్య చరణ సన్నిధిలో ఆసీనులై కుమారి పూర్ణిమ, డా॥ ప్రసన్న, చైతన్య భజనలు పాడుతూ ఉండగా వారిని అనుసరిస్తూ బృందగానాన్ని ఆలపిస్తూ వచ్చారు. చిరంజీవి విజయ సారథి, గోపిక వాద్య సహకారాన్ని అందించారు.

అనంతరం శ్రుతిమందిరం వేదికపై ఆసీనులైన పూజ్య గురుదేవులను డా॥ మదన్ మోహన్ గారు పుష్ప మాలాలంకృతులను గావించుటతో నాటి గణేశోత్సవ ముగింపు సభ ఆరంభ మైనది. పూజ్య గురుదేవులు ప్రణవ నాదోచ్చారణతో తమ దివ్య సందేశాన్ని అనుగ్రహించారు.

'మనమంతా ఈ లోకం లోకి రిక్త హస్తాల తోనే వచ్చాము. ఇక్కడ మనం పొందిన, పొందుతున్న దంతా మనకు ప్రసాదంగా లభించినదే. ఇక్కడ మనకు లభించేది అంతా కేవలం వినియోగం కోసమే తప్ప ఏదీ మనదంటూ ఉండదు. ఒకరు మరొకరికి చేసే దానం కూడా ఆ ఇచ్చే వ్యక్తికి ఒకనాడు ప్రసాదంగా లభించినదే. అలా ప్రసాదంగా అందరికీ అన్నీ వితరణ చేసే అదృశ్య హస్తం భగవంతునిదే. కనుకనే ఆ సర్వశక్తిమంతుని యొక్క దివ్య మహిమను గుర్తెరిగి కృతజ్ఞులమై భక్తి చేయడం. 'నీ కీర్తి తెలిసి దాసుడైనాను . . .' చైతన్య గానం ఈ సత్యాన్నే అద్భుతంగా చాటుతున్నది' అని పూజ్య గురుదేవులు మధుర గానాన్ని ప్రసాదించారు. వినాయకుడే విశ్వానికి తొలి వేల్పు అని 'ప్రథమ వందనా గౌరీనందన' చైతన్య భజనను పూజ్య గురుదేవులు అందరితో పాడించారు.

గత ఆరు దశాబ్దాలుగా ప్రజా బాహుళ్యంలో ఒక నిశ్శబ్ద ఆధ్యాత్మిక విప్లవంగా సాగిపోతున్న 'సుందర చైతన్యోద్యమ' రథ సారథి పూజ్య గురుదేవుల కీర్తి చంద్రికల వైభవాన్ని కొనియాడిన అగ్రశ్రేణి ఆధ్యాత్మిక ప్రముఖ సాధు మహరాజులను పూజ్య గురుదేవులు సభాముఖంగా స్మరణ గావించారు. ఎందరో కొత్త వారున్న నాటి సభకు ఈ స్మరణ ఒక చక్కని ముఖద్వారమైనది.

అనంతరం శ్రీమతి సి.పద్మ గారు పూజ్య గురుదేవుల ఆజ్ఞ మేరకు చేసిన అద్భుత

ప్రసంగం అవశాత్తుగా చేసినదే అయినా ఒక అందమైన కొనసాగింపుగా పూజ్య గురుదేవుల సందేశానికి మృదు మధుర గాన భరిత శబ్దాలంకృతమైనది. 'నీ కీర్తి తెలిసి . . .' చైతన్య గానం శ్రీమతి పద్మ గారి గళంలో పునః సభాసదులకు వీనుల విందు చేసింది.

'మనమంతా ఒకరి కొకరు ఇచ్చి పుచ్చుకునే వన్నీ నశించి పోయేవి, క్షయమై పోయేవే. పూజ్య గురుదేవులు ముక్త పురుషులై కూడా కేవలం ముముక్షు లోక సముద్ధరణకై గత ఆరు దశాబ్దాలుగా ఈ ఉద్యమానికి సర్వమూ తామే అయి శారీరక శ్రమను, ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా అందిస్తున్న జ్ఞానం మాత్రం అక్షయమైనది. ఎన్నటికీ తరిగి పోనిది. మనము ఆ విధంగా ఎంతో అదృష్టవంతులము'. శ్రీమతి పద్మ గారు ఇలా గురువందన సమర్పణ గావించారు.

అనంతరం పూజ్య గురుదేవులు 'ఇందువదన శ్యామా - మందహాస ధామ' చైతన్య భజనను గానం చేస్తూ, చేయిస్తూ గణేశ ప్రతిమ నిమజ్జనానికి అనుమతిని అనుగ్రహించారు. శ్రుతిమందిరం ప్రాంగణం లోనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కృత్రిమ జలాశయంలో నిమజ్జనోత్సవం అత్యంత ప్రకృతి హితంగా మంగళవాద్య ఘోషతో, నామగానంతో సంపూర్ణమైనది. పూజ్య గురుదేవులు 'సుందర చైతన్యాశ్రమం . . .' చైతన్య గానాన్ని అద్భుతంగా గానం చేయడంతో సభ సమాప్తమయింది. తదుపరి గురుదేవుల దర్శన భాగ్యంతో, లడ్డూ, పులిహోర మహాప్రసాద వితరణతో కార్యక్రమం సంపూర్ణమైంది.

**( సర్వమ్ శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానంద సద్గురు దివ్య చరణారవిందార్పణ మస్తు! )**








ఆత్మ బంధువులారా
ఓం నమో భగవతే వాసుదేవాయ.

తండ్రి ఆస్తి బిడ్డల వినియోగానికే. బిడ్డ లందరూ వినియోగించుకోవాలి. భగవంతుడు బంగారు తండ్రి. ఆయన వద్ద ఉన్నదంతా బంగారే. ఆ బంగారమంతా మనదే. కంగారు అనేది అసలు లేనే లేదు; అది ఉందని మనం ఆలోచిస్తే తప్పు.

పరమాత్మ మనల్ని ఐశ్వర్యవంతులుగా మలిచాడు. కాని, మనల్ని మనం బిచ్చగాళ్ళుగా తీర్చి దిద్దుకున్నాం. మనకు ఏదో లేదని అదేపనిగ ఆలోచించటానికి అలవాటుపడ్డాం. అవసరం లేనివాటిని, అందని వాటిని పొందాలని కలలు కనటం నిత్యకృత్యంగా మారిపోయింది. ఇక్కడే బంగారు బ్రతుకు కంగారుగా మారుతోంది. భయ నిలయంగా తయారవుతోంది.

మనస్సు ఉన్నందుకు మనిషి ఆలోచించాలి. బుద్ధి ఉన్నందుకు ఆందోళన చెందకుండా ఉండాలి. ఆందోళనకు గురయ్యే మనిషి శాంతిగా జీవించలేడు. ధ్యానం చేస్తే ప్రశాంతత వస్తుంది; నేను కాదనటం లేదు. కాని, ప్రశాంతత లేనిదే ధ్యానం సాగదు అనే సత్యం ధ్యానం చేస్తేగాని అర్థంకాదు.

పరిచయమైన మనిషి కనిపించగనే 'నమస్తే' అంటాము. ఆ తరువాత మాట్లాడేదంతా సజావుగా ఉంటుంది. ప్రపంచం మనకు క్రొత్తది కాదు. పరిచయమైనదే. నిద్ర లేవగనే ఒక్క చిరునవ్వును చిందించగలిగితే చాలు. ఇక, ఆ రోజంతా హాయిగా కంగారు లేకుండా సాగిపోతుంది. బోధ ప్రారంభించే ముందు శ్రీకృష్ణుడు నవ్వుతున్నట్లు కనిపించాడు **(ప్రహసన్నివ).** బ్రతుకును కూడా మనం నవ్వుతో ప్రారంభించాలి అనేదే ఆయన అభిమతం, అభీష్టం, అభయప్రదానం.

ఓదార్చే శక్తి గలవారు ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. మనం బాధల్ని కొనితెచ్చుకొంటూ ఉంటే, ఇతరులు 'తగుదునమ్మా' పాత్రను పోషిస్తున్నారు. మేడలే కూలిపోతాయి. పేకమేడలు ఎంతకాలం నిలుస్తాయి? ఆశల్ని ఎంతకాలం నిలుపుతాయి?

బాధలకు దూరం కావాలని ఆలోచిస్తాం. వాటిని దగ్గరకు తెచ్చుకున్నది మనమే అని గ్రహించము. పిలవకుంటే, అవి దూరంగానే ఉంటాయి. బాధలకన్నా వాటిని కొనితెచ్చుకొనే ఆలోచనా విధానమే చాలా భయంకరమైనది. ప్రమాదకరమైనది.

'ఇది నా దురదృష్టం' అనే వాక్యానికి మించిన దురదృష్ట వాక్యం మరొకటి ఉండదు అని నా అభిప్రాయం. ఈ వాక్యం ఒక్కటే అయినా, శాంతి నిలయానికి ఉన్న తలుపు

లన్నిటినీ మూసేస్తుంది. లేనిదాని కన్నా, లేదనే భావనే బుద్ధిని క్రుంగదీస్తూ ఉంది. బ్రతుకును కూల్చేస్తూ ఉంది. 'ఇది లేదు - అది లేదు' అని నిద్రలో అనిపిస్తూ ఉందా? అందుకే నిద్ర హాయి. మెలకువలో కూడా లేనివి లేనట్లే లేకుండాపోతే, ఉన్న హాయి అంతా మనదే అవుతుంది. మనమే అవుతుంది.

ఏది దూరమైనా, ఎవరు దూరమైనా పరమాత్మ నీ దగ్గరే ఉన్నాడు. ఆయన సహకారం సదా నీకు అందుతూనే ఉంది. ఆయన కృపతోనే నీవు తిరుగుతున్నావు. ఆయన కృపతోనే నేను తింటున్నాను. క్షణక్షణము ఆయన దయ మనల్ని నడిపిస్తూనే ఉంది. లేకపోతే, మన శ్వాసలు కదుల్తాయా? దురదృష్టం ఎక్కడుంది? ఇదంతా అర్థం కాకపోవటమే దురదృష్టం. భావదారిద్ర్యం ఉండాలే గాని భాగ్యమున్నా బిచ్చగాళ్ళే. భావ సౌందర్యం తోడుంటే లేనివాడు కూడా ఉన్నవాడే. హాయిగా ఉన్నవాడే **(కౌపీనవన్తః ఖలు భాగ్యవన్తః).**

మన కూడా ఎవరున్నారు? పరమాత్మ తప్ప. మనతో సదా ఎవరు కలిసి ఉన్నారు? పరమాత్మ తప్ప. మరి, ఉన్నవాడు నిద్రపోతూ ఉన్నాడా? నిన్ను నిద్రపుచ్చేందుకు ఉన్నాడు. బాధలు సమీపించకుండా నిన్ను జోకొట్టి నిద్రపుచ్చేందుకు మేలుకొని యున్నాడు. లోపలే ఉండి కాపలా కాస్తూ ఉన్నాడు. కళ్ళెమును అప్పగించి కంగారు లేకుండా ఉండమంటున్నాడు. చూస్తూ ఉండగనే బ్రతుకు బండిని బంగారు బాటలో నడిపిస్తానంటున్నాడు.

లేనివాళ్ళను ఎవ్వరూ పిలవరు. ఉన్నవాళ్ళే అయినా పిలిస్తే గాని రారు. పరమాత్మ ఉన్నవాడే. పిలిస్తే పలుకుతూ వచ్చేవాడే. పిలిచే సంస్కారమే ఇప్పుడు మన బుద్ధికి పట్టాలి. ఇది అభ్యర్థన కాదు; ప్రార్థన.

మనమందరము మోక్షమార్గంలోనే ఉన్నాము. కాని, నడవకపోతే గమ్యాన్ని చేరలేము. నడిపేవాడు ఉన్నాడు. అయినా మనం నడవాలి. నడుస్తూ ఉంటే చాలు. ఇప్పుడు మనం కంగారులో ఉన్నాం. భయాలతో బ్రతుకుతున్నాం. నడుస్తూ ముందుకుపోతే భయాలకు, బాధలకు దూరమవుతాము. శాంతికి, సుఖానికి చేరువవుతాము. ఇది వాస్తవం కాకపోతే, 'వేదాంతం' అనే పదానికి అర్థమే లేదు. ఆ బాటలో నడిచేవారికి పరమార్థమే లేదు.

కాని, వేదాంతం ఎవ్వరినీ ఇంతవరకు వృథా చేయలేదు. వేదాంత మార్గంలో త్రికరణ శుద్ధితో నడచిన వారెవ్వరూ ఇంతవరకు వృథా కాలేదు.

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు**
**మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే॥**

'నా యందు మనస్సు నుంచు. నా భక్తుడివి కా. నన్ను అర్చించు. నాకు నమస్కరించు. నన్నే పొందుతావు. నీవు నాకు ప్రియుడవు. అందుకే ఈ సత్యమును ప్రతిజ్ఞ చేసి చెబుతున్నాను' అని గీతలో విజయసారథి మ్రోగించిన విజయభేరి.

**20-9-2025** **మీ**

**ఆశ్రమం** ఓం స్వామి సుందర చైతన్యానంద





